Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

సంపుటి : 01 సంచిక : 191 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ సోమవారం 04-08-2025 పేజీలు :12 వెల :2/-

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9398191920.

## జమ్మూ కశ్మీర్‌లో పెరుగుతున్న

# సైబర్ ఉగ్రవాదం..!



**కశ్మీర్ :** కశ్మీర్ లోయలోని యువత ఉగ్రవాద నాయకులను సోషల్ మీడియాలో ఫాలో అవుతున్నారు. ఇది సైద్ధాంతిక విశ్వాసం కంటే డబ్బు సంపాదించే వ్యూహం. పోలీసులు ఈ ఖాతాలను పర్యవేక్షిస్తున్నారు. కొంతమంది యువతను అదుపులోకి తీసుకున్నారు. ఈ ధోరణి సోషల్ మీడియా మానిటైజేషన్ వ్యవస్థలోని లోపాలను వెల్లడిస్తుంది.జమ్మూ కాశ్మీర్ యువతలో సోషల్ మీడియాకు సంబంధించి కొత్త ట్రెండ్ ఏర్పడింది. ఉగ్రవాద నాయకులను సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో ఫాలో అవుతున్నారు. ఆయా అకౌంట్లకు ఫాలోవర్లు కూడా పెరిగిపోతున్నారు. కాశ్మీర్ లోయలోని కొంతమంది యువతలో వేర్పాటువాద, ఉగ్రవాద వ్యక్తులను కీర్తించడానికి సోషల్ మీడియాను ఉపయోగించే కొత్త ధోరణిని భద్రతా సంస్థలు వెలికితీశాయి. ఈ ధోరణి సైద్ధాంతిక నిబద్ధత కారణంగా కాదు, అనుచరులను పెంచుకోవడానికి, ప్రకటనదారుల నుండి డబ్బు సంపాదించడానికి ఉద్దేశపూర్వక వ్యూహంగా ప్రారంభమైంది.శ్రీనగర్ పోలీసులు రాడికలైజేషన్ ప్రక్రియను ఎదుర్కోవడానికి సోషల్ మీడియా సైట్‌లను పర్యవేక్షించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ఇటువంటి ఖాతాలను నడుపుతున్న కొంతమంది యువకులను అదుపులోకి తీసుకున్న తర్వాత ఈ విధానం గురించి తెలిసింది. విచారణలో ఓ యువకుడు ఇటీవల హతమైన హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వాని ఉపయోగించిన చిత్రాలను పోలిన రెచ్చగొట్టే చిత్రాలను ఉపయోగించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సరిహద్దులు దాటి, విదేశాల నుండి పెద్ద సంఖ్యలో అనుచరులను సంపాదించిన తర్వాత, ఖాతాలను నిర్వహిస్తున్న వారు ఈ ఛాయాచిత్రాలను పర్వతాలు లేదా చినార్ చెట్ల వంటి వాటితో భర్తీ చేస్తారని అధికారులు తెలిపారు.





ఈ ప్రాంతంలో ఆన్‌లైన్ ప్రచార వాతావరణం రాజకీయ ప్రత్యర్థులు, రాడికల్ అంశాలు, అవకాశవాదులకు ఆన్‌లైన్‌లో కీర్తి, డబ్బు సంపాదించడానికి కొత్త అవకాశాలను అందిస్తున్నందున ఈ కొత్త ధోరణి ఆందోళనకరంగా ఉండవచ్చని అధికారులు తెలిపారు. సున్నితమైన భద్రతా పరిస్థితులను వ్యక్తిగత లాభం కోసం ఉపయోగించుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి, వారి నిఘాను పెంచడానికి పోలీసులు కట్టుబడి ఉన్నారు. అదే సమయంలో ఇది వారి పిల్లల భవిష్యత్తును ఎలా ప్రభావితం చేస్తుందో కుటుంబాలకు వివరించడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల పోలీసులు అదుపులోకి తీసుకున్న ఏడుగురు పిల్లలను వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చిన తర్వాత విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కాశ్మీర్ లోయలో రెచ్చగొట్టే చిత్రాలను ఉపయోగించి సోషల్ మీడియాను ప్రభావితం చేసే వారి పెరుగుదల వెనుక ఉన్న ఉద్దేశ్యం ఆర్థికపరమైనదని అధికారులు భావిస్తున్నారు. బ్లూ-టిక్ వెరిఫికేషన్ సిస్టమ్ ఉన్నప్పటికీ, రెవెన్యూ-షేరింగ్ మోడల్ ఇప్పటికీ అస్పష్టంగానే ఉందని మూడు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పనిచేస్తున్న ఇద్దరు ప్రముఖ ఇన్ఫ్లుయెన్సర్లు తెలిపారు. ఒక ఇన్ఫ్లుయెన్సర్, పేరు వెల్లడించడానికి ఇష్టపడకుండా, ఈ ప్రక్రియను "అస్పష్టంగా" అభివర్ణించారు. చెల్లింపుల

మిగితా 2లో

## 35 కీలక ఔషధాల ధరలు తగ్గించిన కేంద్రం

- సామాన్యులకు భారీ ఊరట.. బీపీ, షుగర్ మందులు ఇకపై చౌక
- నొప్పి నివారణ, యాంటీబయాటిక్ మందులు కూడా చౌక
- కొత్త ధరల జాబితాను దుకాణాల్లో ప్రదర్శించాలని ఆదేశం
- అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలని ప్రభుత్వ హెచ్చరిక
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఊరటనిచ్చే నిర్ణయం



2

## ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలి: కెటిఆర్

- కాంగ్రెస్ అగ్రనేతలు డిక్లరేషన్ల పేరుతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు
- అసమర్థ, అవినీతి కాంగ్రెస్ పాలనకు తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పాలి
- రాష్ట్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు కలిసి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 20 నెలల అసమర్థ, అరాచక, అవినీతి పాలనకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణలోని అన్నీ వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్‌కు రానున్న ఉపఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టాలని అన్నారు. ఎన్నికల ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే వంటి కాంగ్రెస్ అగ్ర నేతలు తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను డిక్లరేషన్ల పేరుతో మోసం చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన

మిగితా 2లో



2లో

## రూ.650 కోట్లతో ఎల్బీనగర్ -పెద్ద అంబర్ పేట మధ్య ఎలివేటెడ్ కారిడార్

- 2 నెలల్లో హైదరాబాద్-విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు ప్రారంభం
- మెట్రో రైలు రెండో దశ పనుల బాధ్యత సిఎం నాపైనే ఉంచారు
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

## రష్యాలో ప్రకృతి ప్రకోపం... బద్దలైన అగ్నిపర్వతం...



- రష్యాలోని కురిల్ దీవుల్లో భారీ భూకంపం
- రిక్టర్ స్కేల్‌పై 7.0గా నమోదైన తీవ్రత
- పలు ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ కమ్చట్కాలో రెండు అగ్నిపర్వతాల విస్ఫోటనం
- 600 ఏళ్ల తర్వాత బద్దలైన క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

2

## యూపీలో ఘోర ప్రమాదం... కాలువలోకి దూసుకెళ్లిన కారు... 11 మంది మృతి



- ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- సరయూ కాలువలోకి దూసుకెళ్లిన భక్తుల వాహనం
- ఈ ఘటనలో 11 మంది దుర్మరణం, నలుగురికి గాయాలు
- మృతుల కుటుంబాలకు సీఎం యోగి రూ. 5 లక్షల పరిహారం
- ప్రధాని మోదీ రూ. 2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటన

## గొర్రెల కుంభకోణం.. మాజీ మంత్రి తలసాని పాత్రపై ఇడి ఆరా

- త్వరలో తలసానికి నోటీసులు?
- ఓఎస్‌డి ఇంట్లో లభించిన ఆధారాలు
- రూ. 253 కోట్ల కుంభకోణంగా తేల్చిన కాగ్
- ఇడి విచారణలో రూ.వెయ్యికోట్లుగా తేలింది



## ఓల్డ్ సిటీలో మెట్రో రైల్ మార్గం విస్తరణ పనులు వేగవంతం

2



- ప్రభావిత ఆస్తుల సంఖ్య కుదింపు
- పిల్లర్ల మార్కింగ్ ప్రారంభం
- రోజువారీగా సమీక్షిస్తున్న మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి

# 35 కీలక ఔషధాల ధరలు తగ్గించిన కేంద్రం

సామాన్యులకు, ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊరట కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 35 రకాల నిత్యావసర మందుల రిటైల్ ధరలను తగ్గిస్తున్నట్లు జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు, నొప్పి నివారణ, యాంటీబయాటిక్ వంటి కీలక ఔషధాల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి.

**ఏయే మందుల ధరలు తగ్గాయి?**

ధరలు తగ్గించిన జాబితాలో ప్రముఖ ఫార్మా కంపెనీలు తయారుచేసే అనేక ముఖ్యమైన మందులు ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్ మార్కెటింగ్ చేస్తున్న ఏసెక్లోఫెనాక్, పారాసెటమాల్, ట్రిప్సిన్ కైమోట్రిప్సిన్ కాంబినేషన్ టాబ్లెట్ ధరను రూ. 13గా ఎన్‌పీపీఏ నిర్ధారించింది. ఇదే ఫార్ములేషన్‌తో క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ విక్రయించే టాబ్లెట్ ధర రూ. 15.01గా నిర్ణయించారు.గుండె జబ్బులకు వాడే అటోర్వాస్టాటిన్ (40 ఎంజీ), క్లోపిడోగ్రెల్ (75 ఎంజీ) కలిగిన టాబ్లెట్ ధరను రూ. 25.61గా ఖరారు చేశారు. వీటితో పాటు విటమిన్ డి లోపానికి వాడే కోలికాల్సిఫెరాల్ చుక్కల మందు, చిన్న పిల్లలకు ఇచ్చే సెఫిక్సిమ్, పారాసెటమాల్ ఓరల్ సస్పెన్షన్, నొప్పి నివారణకు ఉపయోగించే డైక్లోఫెనాక్ ఇంజెక్షన్ (ఒక మిల్లీలీటర్‌కు రూ. 31.77) వంటివి కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

**నిబంధనలు తప్పనిసరి**

కొత్తగా నిర్ణయించిన ధరల జాబితాను రిటైల్ వ్యాపారులు, డీలర్లు తమ దుకాణాల్లో స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఎన్‌పీపీఏ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వడ్డీతో సహా రాబట్టడంతో పాటు, డ్రగ్స్ (ధరల నియంత్రణ) ఆర్డర్-2013, నిత్యావసర వస్తువుల చట్టం-1955 కింద చర్యలు తీసుకుంటారు.

ఈ ధరలకు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అదనంగా ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఔషధ తయారీ కంపెనీలు తమ కొత్త ధరల పట్టికను ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐపీడీఎంఎస్) ద్వారా జారీ చేసి, ఆ సమాచారాన్ని ఎన్‌పీపీఏకి, రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్లకు సమర్పించాలని ఆదేశించారు. ఈ తాజా ఉత్తర్వులతో పాత ధరల ఉత్తర్వులు రద్దయినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలి: కెటిఆర్

హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వానికి కచ్చితంగా బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు కలిసి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని కెటిఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేస్తున్న అవినీతి, కుంభకోణాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాపాడుతోందని, అందుకే మోడీ ఇప్పటివరకు ఒక్క కేసు కూడా పెట్టలేదని విమర్శించారు. ఈ రెండు పార్టీల ఏకైక అజెండా తెలంగాణ పార్టీని ఓడించడమేనని పేర్కొన్నారు.

**పేదల ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చుతున్నారు**

హైదరాబాద్ నగరంలో పేద ప్రజల ఇళ్లను కూల్చివేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కెటిఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదవాడు ప్రభుత్వ స్థలంలో చిన్న గూడు కట్టుకుంటే దాన్ని నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని, కానీ..ధనికుల ఇళ్లకు మాత్రం హైడ్రా పోదు అని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు, మంత్రులు, కాంగ్రెస్ నేతలు చెరువుల్లో ఇండ్లు కట్టుకుంటే హైడ్రా వారిపైపు కనెత్తి చూడదని, పేద వాళ్ల ఇండ్లను మాత్రం ఎలాంటి నోటీసులు లేకుండా సెలవు దినాల్లో కూల్చి వేస్తుందని అన్నారు. కూకట్‌పల్లిలో ఇల్లు కూలుస్తారని భయంతో ఒక వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను ఒక అగ్రగామి నగరంగా తీర్చిదిద్దిందని గుర్తు చేశారు. లక్ష మంది పేద ప్రజలకు జీవో నెం. 58 ద్వారా పట్టాలు ఇచ్చి, వారి జీవితాలను నిలబెట్టిన నాయకుడు కెసిఆర్ అని పేర్కొన్నారు. ఆడపిల్లల పెళ్లిళ్లకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి వంటి అనేక సంక్షేమ పథకాలను అందించామని వివరించారు. కెసిఆర్ ఎప్పుడూ మతం పేరుతో రాజకీయాలు చేయలేదని, అందుకే పదేళ్లలో హిందూ -ముస్లిం, ఆంధ్రా తెలంగాణ గొడవలు జరగలేదని అన్నారు.

**జూబ్లీహిల్స్‌లో మరోసారి గులాబీ జెండా ఎగురవేద్దాం**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తలతో జరిగిన సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ, దివంగత మాగంటి గోపీనాథ్ సేవలను కొనియాడారు. ఆయన అకాల మరణం కారణంగా వచ్చిన ఉపఎన్నికను మనం సీరియస్‌గా తీసుకొని గెలుపు కోసం కష్టపడాలని పిలుపునిచ్చారు. మాగంటి గోపీనాథ్‌కు నివాళిగా, మరోసారి జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగురవేద్దామని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త 100 ఓట్లకు ఒకరు, 25 ఇళ్లకు ఒకరు చొప్పున పనిచేసి, కెసిఆర్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ పాలన మధ్య తేడాను ప్రజలకు వివరించాలని కెటిఆర్ సూచించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్, మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, పార్టీ నేతలు రావుల శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రూ.650 కోట్లతో ఎల్బీనగర్- పెద్ద అంబర్‌పేట మధ్య ఎలివేటెడ్ కారిడార్

**హైదరాబాద్:** నగర శివారులోని ఎల్బీనగర్ నుండి పెద్ద అంబర్ పేట వరకు సుమారు రూ.650 కోట్ల వ్యయంతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయబోతున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి వనస్థలిపురం జంక్షన్‌లో మంత్రి ఆదివారం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఎన్‌హెచ్ ఎస్.ఈ ధర్మారెడ్డి, పలువురు ఆర్ అండ్ బి అధికారులు ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదనలు, డిజైన్లను మంత్రికి వివరించారు. వీటిని పరిశీలించిన మంత్రి త్వరగా కేంద్రం అనుమతి పొంది, పనులు ప్రారంభించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై ఎన్‌హెచ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మంత్రి వెంట ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఆర్‌డిసి చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, స్థానిక నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కారిడార్ చాలా ప్రత్యేకమైందని, ఎల్బీనగర్ నుండి హయత్ నగర్, పెద్ద అంబర్ పేట వరకు, ఓఆర్‌ఆర్ మీదుగా ఎలివేటెడ్ కారిడార్ ఉంటుందని పేర్కొన్నారు. వనస్థలిపురం నుండి హయత్ నగర్ రేడియో స్టేషన్ వరకు సుమారు 6 కి.మీ మెట్రో రైలు మార్గం గుండా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీనీ కలిసి కోరుతానని అన్నారు.

ఈ ప్రాంత ప్రజల ట్రాఫిక్ కష్టాలు తనకు తెలుసునని, ఎంపీగా ఉన్నప్పుడే ఈ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధి కోసం తాను కృషి చేశానని అన్నారు. ఇప్పుడు రోడ్లు భవనాలు శాఖ మంత్రిగా తాను ఉన్నందున ఈ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎల్బీనగర్ నుండి మల్కాపూర్ రోడ్డు కోసం రూ.541 కోట్లు మంజూరు చేయించానన్నారు. ఆరు లేన్ల రోడ్డు మంజూరు కాగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అందులో నాలుగు వెహికల్ అండర్ పాస్‌లు ఇప్పటికే పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. రూ.2300 కోట్లతో గౌరెల్లి, వలిగొండ, భద్రాచలం గ్రీన్ ఫీల్ హైవే మంజూరైందని, ఇప్పటికే వలిగొండ తొర్రూరు మధ్య నిర్మాణ పనులు పూర్తయ్యాయని అన్నారు. తొర్రూరు భద్రాచలం మధ్య రోడ్డు పనుల కోసం టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఆందోల్ మైసమ్మ నుండి విజయవాడ వరకు రూ.375 కోట్లతో రోడ్డు నిర్మాణం శరవేగంగా కొనసాగుతుందని, ఈ మధ్య 17 బ్లాక్ స్పాట్స్ (యాక్సిడెంట్ స్పాట్స్) గుర్తించామని, యాక్సిడెంట్స్ జరిగి ఏ ఒక్క ప్రాణం పోకుండా రోడ్డు నిర్మాణం చేయడమే తమకు అత్యంత ప్రాధాన్యమని అన్నారు.

**హైదరాబాద్-విజయవాడ మధ్య గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం**

హైదరాబాద్ నుండి విజయవాడకు రెండు గంటల్లో చేరుకునేలా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేయబోతున్నామని కూడా వెల్లడించారు. ఈ విషయమై కేంద్ర మంత్రి గడ్కరీని ఈ నెల 6న కలుస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్లేందుకు విమాన ప్రయాణం ద్వారా మొత్తం 5 గంటల సమయం పడుతుందని, కానీ రోడ్డు మార్గం ద్వారానే రెండు గంటల్లో చేరుకునేలా ఈ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేయబోతున్నామని తెలిపారు. రెండు నెలల్లో పనులు ప్రారంభం కానున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వివరించారు. ఇప్పటికే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా గ్రీన్ ఫీల్ హైవే కోసం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని, తెలుగు ప్రజల మెరుగైన రవాణా సౌకర్యం కోసం తమ ప్రభుత్వం నిర్విరామకృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణం చేపట్టబోతున్నామన్నారు.

మెట్రో రైలు రెండో దశ పనుల బాధ్యత సిఎం నాపైనే ఉంచారు

మెట్రో రైలు రెండో దశ అనుమతులకు సంబంధించిన బాధ్యతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై ఉంచారని అన్నారు. ఇటీవల బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఈ సందర్భంగా ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి మెట్రో మొదటి దశ నిర్మాణం కోసం అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్ రెడ్డి కృషి చేశారని, మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రెండో దశ మెట్రోకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మెట్రో రైలు అనుమతుల కోసం, రీజినల్ రింగ్ రైల్ కోసం ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి కలుస్తామని తెలిపారు. విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ హైదరాబాద్ అభివృద్ధి చేశామంటున్న కేటీఆర్ ఉప్పల్ నారపల్లి ఫ్లై ఓవర్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను ఏమార్చిందని విమర్శించారు. సమయం వృధా చేశారు తప్ప అభివృద్ధి చేయలేదని అన్నారు. బంగారు తెలంగాణ అంటూ అప్పుల తెలంగాణ చేసిందని ఆయన బిఆర్ఎస్ పాలనపై మండిపడ్డారు. ప్రజలే దేవుళ్ళుగా మారి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్లు గురించి కేసిఆర్ బిడ్డ కవితకు ఏం సంబంధం ఉందని అన్నారు.

పదేళ్లు బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బీసీల గురించి ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. ఎన్నికల హామీల మేరకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని అన్నారు. ఎవరెంతో వారికంతా ఇవ్వాలనేది తమ ఇందిరమ్మ ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. రోడ్లు భవనాల శాఖ పరిధిలో నగర నలువైపులా నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్స్ ప్రజలకు త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సెప్టెంబర్‌లో సనత్ నగర్ టిమ్స్ ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిర్ణయం ప్రకారం 'ఎవరెంతో వారికంతా ఇవ్వాలనేది తమ ఇందిరమ్మ ప్రభుత్వ విధానమని అన్నారు. ఈనెల 5,6,7 తేదీల్లో ఢిల్లీ వేదికగా కేంద్రాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్ర ప్రభుత్వం కావాలనే నాన్చుతుందని మంత్రి దుయ్యబట్టారు.

**టెండర్ ప్రక్రియకు చేరుకున్న పలు జాతీయ రోడ్లు:మల్ రెడ్డి రంగారెడ్డి**

కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆర్ అండ్ బి మంత్రి కావడం రాష్ట్ర ప్రజల అదృష్టమని ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. గౌరెల్లి, వలిగొండ భద్రాచలం గ్రీన్ ఫీల్ హైవే, బాట సింగారం, బండరావిరాల ప్రాంతాల జాతీయ రోడ్లు టెండర్ ప్రక్రియకు చేరుకున్నాయని అన్నారు. ఇబ్రహీం పట్నం, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో రోడ్ల కనెక్టివిటీ పెంచి, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు మంత్రి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఆర్‌డిసి) చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలో తనకున్న వ్యక్తిగత పరిచయాలతో రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో రోడ్లకు అనుమతులు ఇప్పిస్తూ, నిధులు మంజూరు చేయిస్తున్నారని మంత్రి కోమటి రెడ్డి కి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# యూపీలో ఘోర ప్రమాదం... కాలువలోకి దూసుకెళ్లిన కారు... 11 మంది మృతి

**ఉత్తరప్రదేశ్ :** ఉత్తరప్రదేశ్‌లో ఆదివారం నాడు ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భక్తులతో వెళుతున్న ఒక వాహనం అదుపుతప్పి కాలువలో పడటంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన గోండా జిల్లాలో జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ప్రమాదంలో మరో నలుగురు గాయపడ్డారు.మోతిగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిహాగావ్ గ్రామానికి చెందిన 14 మంది ఒక బొలెరో వాహనంలో ఖర్గుపూర్‌లోని పృథ్వీనాథ్ ఆలయానికి పూజల కోసం బయలుదేరారు. మార్గమధ్యంలో వీరి వాహనం సరయూ కాలువలోకి దూసుకెళ్లింది. వాహనం నీటిలో మునిగిపోవడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొందరు గ్రామ పెద్దకు విషయం చేరవేశారు.

సమాచారం అందుకున్న ఇటియాథోక్ పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నీటిలో మునిగిపోయిన వాహనం నుంచి మృతదేహాలను వెలికితీశారు. మృతులలో పురుషులు, మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. ఈ దుర్ఘటనపై జిల్లా ఎస్పీ వినీత్ జైస్వాల్ మాట్లాడుతూ, "ఆలయానికి వెళుతుండగా బొలెరో వాహనం కాలువలో పడిపోవడంతో 11 మంది మరణించారు. స్వల్ప గాయాలతో బయటపడిన నలుగురిని రక్షించి జిల్లా ఆసుపత్రికి తరలించాం" అని తెలిపారు.

ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్‌ఆర్‌ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం అందిస్తామని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఓల్డ్ సిటీలో మెట్రో రైల్ మార్గం విస్తరణ పనులు వేగవంతం

**హైదరాబాద్:** పాతనగరంలో మెట్రోరైల్ విస్తరణ పనులు వేగవంతం అయ్యాయి. ఎంజిబిఎస్ నుండి చంద్రాయన్ గుట్ట మధ్య మెట్రో రైల్ కారిడార్ ఏర్పాటుకు సంబంధించిన రోడ్డు విస్తరణ పనులను మరింత వేగవంతం చేశారు. ఏడున్నర కిలోమీటర్ల మార్గంలో అలైన్మెంట్ అద్భుతంగా ఉండేలా చర్యలు చేపట్టామని, ఈ మార్గంలో రోడ్ విస్తరణ వల్ల ప్రభావితం అయ్యే ఆస్తుల సంఖ్యను తగ్గించేలా మార్గాన్ని రూపకల్పన చేశామని హెచ్‌ఎంఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు. మెట్రో పనులకు సంబంధించి ఇంజినీరింగ్, రెవిన్యూ అధికారులతో రోజు వారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని అయన అన్నారు. ముందనుకున్న అంచనా ప్రకారం 1100 ఆస్తులు ఈ విస్తరణలో కూల్చవలసి ఉంటుందని భావించామని, కాని ఎలైన్మెంట్ ను ఇంజనీరింగ్ నవకల్పన ద్వారా సరిదిద్దటం వల్ల ఆ సంఖ్య 900 వరకు తగ్గిందని ఆయన తెలిపారు.

వీటిలో ఇప్పటికే 412 ఆస్తులకు సంబంధించిన అవార్డులు జరీ చేశామని, 380 ఆస్తుల కూల్చివేతలు ఇప్పటివరకు పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు. వీటి కోసం రు. 360 కోట్ల నష్టపరిహారం ప్రభావిత ఆస్తుల వారికి చెల్లించినట్లు తెలిపారు. ప్రభావిత ఆస్తులను స్వాధీనం చేసుకుంటూ, కూల్చివేతలు చేసి అవశేషాలను తొలగించడంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించి పనులు ముమ్మరంగా చేపడుతున్నామని మెట్రో ఎండి తెలిపారు. ఇక్కడ ఇళ్లు ఒకదానిని ఒకటి ఆనుకుని ఉండటం వల్ల, పైగా ప్రతి కట్టడానికి సంక్లిష్టమైన విద్యుత్ లైన్లు, ఇతర కేబుళ్లు వ్రేలాడుతూ ఉండడంతో వాటిని చాలా అప్రమత్తంగా తొలగిస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు.

సాధారణ జనజీవనానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అర్ధరాత్రి సమయాల్లో విస్తరణ పనులు ముమ్మరంగా చేస్తున్నామని ఆయన తెలిపారు. మిగిలిన ఆస్తుల స్వాధీనానికి, త్వరితగతిన కూల్చివేతలు పూర్తిచేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన వెల్లడించారు.

మరోవైపు మెట్రో నిర్మాణ పనులు ప్రారంభించడానికి వీలుగా చర్యలు చేపట్టామని మెట్రో ఎండి తెలిపారు. ఈ కారిడార్ లో వచ్చే పిల్లర్ల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించి వాటిని మార్కింగ్ చేసే పని ప్రారంభించినట్లు వెల్లడించారు. వయాడక్ట్ ను నిలిపే పిల్లర్ల మధ్య 25 మీటర్ల (సుమారు 82 అడుగులు) దూరం ఉంటుందని ఆయన చెప్పారు. మెట్రో స్తంభాలు, స్టేషన్లు వచ్చే చోట భూసామర్థ్య పరీక్షల కోసం ఏజెన్సీని నియమించామని, త్వరలో భూసామర్థ్య పరీక్షలు కూడా చేపడతామని ఆయన వెల్లడించారు. చారిత్రక, ఇతర సున్నిత కట్టడాలకు అంతరాయం కలగకుండా, పిల్లర్, మెట్రో స్టేషన్ల స్థానం నిర్ణయించేందుకు డిజిపిఎస్ సర్వే నిర్వహించామని ఆయన తెలిపారు. నిర్మాణ సమయంలో సర్వే సులభంగా జరిగేలా భూమిపై తాత్కాలిక బెంచ్ మార్క్ (టిబిఎమ్) లొకేషన్లు నిర్ణయించినట్టు ఆయన స్పష్టం చేశారు. పిల్లర్లు, స్టేషన్లు వచ్చే ప్రాంతాల్లో భూగర్భ మరుగునీటి లైన్లు, మంచినీటి లైన్లు, వరదనీటి డ్రైన్లు, పైన వేలాడే విద్యుత్ లైన్లు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. విద్యుత్ లైన్లను అండర్ గ్రౌండ్ లేబుళ్లుగా మారుస్తామని తెలిపారు. ఇందుకోసం వాటర్ బోర్డు, జిహెచ్‌ఎంసి, టిజిఎస్‌పిడిసిఎల్ విభాగాల నుండి త్వరగా అంచనాలు సమర్పించవలసిందిగా కోరామని ఆయన చెప్పారు. ఆయా శాఖల అధికారులతో మెట్రో అధికారులు రేయింబవళ్లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ ముఖ్యమైన యుటిలిటీస్ ని గుర్తించే పని చేపట్టారని ఎన్ వి ఎస్ రెడ్డి తెలిపారు.

# జమ్మూ కశ్మీర్‌లో పెరుగుతున్న సైబర్ ఉగ్రవాదం..!

ఫ్రీక్వెన్సీ, మొత్తాన్ని నిర్ణయించే అంశాలు మిస్టరీగా మిగిలిపోయాయని అన్నారు. సోషల్ మీడియా మానిటైజేషన్ ఎలా పనిచేస్తుందో ఈ డిజిటల్ గోల్డ్ రష్ అర్థం చేసుకోవడం, యువ కాశ్మీరీలు అనుచరులను సంపాదించడానికి వేర్పాటువాద చిత్రాలను ఎలా ఉపయోగిస్తున్నారో పరిశీలించడం వల్ల ఆధునిక డిజిటల్ ఆర్థిక వ్యవస్థ లోతైన, సంక్లిష్టమైన కథను వెలికితీస్తుంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి ప్రధాన ప్లాట్‌ఫామ్‌లలో మానిటైజేషన్ అనేది ప్రత్యక్ష ప్రకటన ఆదాయం, సబ్‌స్క్రిప్షన్‌లు, బ్రాండ్ డీల్‌ల కలయిక, వీటికి వాటి స్వంత నియమాలు, పరిమితులు ఉన్నాయి. మరో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌కు ప్రొఫెషనల్ ఖాతా, 10,000 మంది ఫాలోవర్లు, 60 రోజుల్లో వెయ్యి నిమిషాల కంటెంట్ చూడటం అవసరం. అందువల్ల కాశ్మీర్‌లో అనుచరుల సంఖ్యను పెంచడానికి రెచ్చగొట్టే కంటెంట్‌ను ఉపయోగించే వ్యూహం ఈ అస్థిర డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ప్రత్యక్ష ఫలితం అనిపిస్తుంది.

# రష్యాలో ప్రకృతి ప్రకోపం... బద్దలైన అగ్నిపర్వతం...

**రష్యా :** రష్యాలో ప్రకృతి ప్రకోపం కొనసాగుతోంది. ఒకవైపు భారీ భూకంపం, మరోవైపు అగ్నిపర్వతాల విస్ఫోటనంతో అట్టుడుకుతోంది. ఆదివారం కురిల్ దీవుల్లో శక్తివంతమైన భూకంపం సంభవించగా, సమీపంలోని కమ్చట్కా ద్వీపకల్పంలో అగ్నిపర్వతాలు లావాను వెదజల్లుతున్నాయి. ఈ వరుస విపత్తులతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.వివరాల్లోకి వెళితే, రష్యాలోని కురిల్ దీవులలో ఆదివారం భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.0గా నమోదైనట్లు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (యూఎస్ జీఎస్), జపాన్ వాతావరణ శాఖ ధృవీకరించాయి. భూకంపం ధాటికి భవనాలు తీవ్రంగా కంపించడంతో, ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. దీని తీవ్రత దృష్ట్యా రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ కొన్ని ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలను జారీ చేసింది. ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు.ఇదిలా ఉండగా, కమ్చట్కా ద్వీపకల్పంలో శనివారం అర్ధరాత్రి అగ్నిపర్వతాలు బద్దలయ్యాయి. దాదాపు 600 సంవత్సరాలుగా నిద్రాణంగా ఉన్న క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం ఒక్కసారిగా విస్ఫోటనం చెందింది. ఈ విస్ఫోటనంతో సుమారు 6,000 మీటర్ల ఎత్తు వరకు బూడిద ఎగసిపడినట్లు రష్యా అధికారులు తెలిపారు. దీనితో పాటు, అత్యంత చురుగ్గా ఉండే క్ల్యూచెస్కీ అగ్నిపర్వతం కూడా బద్దలైనట్లు స్థానిక మీడియా పేర్కొంది.

ఇటీవల ఇదే ప్రాంతంలో 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన నేపథ్యంలో తాజా ప్రకంపనలు చోటుచేసుకోవడం గమనార్హం. గత భూకంపం ప్రభావంతోనే తాజా ప్రకంపనలు సంభవించి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మరిన్ని ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

# గొర్రెల కుంభకోణం.. మాజీ మంత్రి తలసాని పాత్రపై ఇడి ఆరా

**హైదరాబాద్:** బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన భారీ కుంభకోణం కొత్త మలుపు తిరగబోతోంది. ఇప్పటి వరకు ఈ కుంభకోణంలో ఆ శాఖ అధికారులు, ఉద్యోగుల వరకే పరిమితం అయిన దర్యాప్తు, ఇక నుంచి అప్పట్లో ఆ శాఖ మంత్రిగా పనిచేసిన తలసాని శ్రీనివాస్ యాదవ్ పై దృష్టి సారించబోతున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. త్వరలో ఆయనకు ఇడి నోటీసు జారీ చేయబోతున్నట్టు తెలిసింది. మొదట ఈ కుంభకోణం రూ.253 కోట్లుగా 'కాగ్' తేల్చగా, దీనిపై తీగలాగితే అది వెయ్యికోట్లపైగానేఉన్నట్టు తేలిందని ఇడి అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ భారీ కుంభకోణం వెనుక బడాబాబు పాత్రపై నిగ్గుతేల్చేందుకు ఇడి అధికారులు రంగం సిద్ధం చేస్తోన్నట్టు ఈ వర్గాల సమాచారం.

ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ పాత్రపై ఇడి ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అప్పట్లో మంత్రి వద్ద ఓఎస్‌డిగా పనిచేసిన కళ్యాణ్ నివాసంలో ఇడి నిర్వహించిన తనఖీలలో కీలకమైన ఆధారాలు లభించినట్టు ఈ వర్గాల సమాచారం. సంబంధిత శాఖ మంత్రికి తెలియకుండా ఓఎస్‌డి రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి పాల్పడుతారా? అని ఇడి అనుమానానికి తనఖీలలో లభించిన సాక్షాధారాలు బలం చేకూర్చినట్టు తెలిసింది. దీంతో ఇడి అధికారులు త్వరలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు నోటిసులు జారీ చేసి విచారణకు పిలువబోతున్నట్టు తెలిసింది.

# అంజీర్ పండ్లను అసలు రోజులో ఏ సమయంలో తినాలి..? ఎన్ని తింటే మంచిది..?



ఆరోగ్యంగా ఉండాలని చెప్పి ప్రస్తుతం చాలా మంది ఆరోగ్యకరమైన ఆహారాలను తినేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. ముఖ్యంగా పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను తింటున్నారు. అలాంటి వాటిల్లో అంజీర్ పండ్లు కూడా ఒకటి. అంజీర్ పండ్లు మనకు రెండు రకాలుగా లభిస్తాయి. నేరుగా పండ్ల రూపంలో వీటిని తినవచ్చు. లేదా డ్రై ఫ్రూట్స్‌ను కూడా తినవచ్చు. అంజీర్ పండ్లు మనకు ఏడాది పొడవునా లభించవు. కానీ అంజీర్ డ్రై ఫ్రూట్స్ మాత్రం మనకు అన్ని సమయాల్లోనూ అందుబాటులో ఉంటాయి. అయితే ఆరోగ్యం కోసం అంజీర్ డ్రై ఫ్రూట్స్‌ను తినాలని తెలుసు. కానీ వీటిని అసలు రోజుకు ఎన్ని తినాలి.. ఏ సమయంలో తింటే మంచిది.. అని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

**బరువు తగ్గాలనుకుంటే..** అంజీర్ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది పేగుల్లో మలం కదలికలను సులభతరం చేస్తుంది. అందువల్ల ఈ పండ్లను తింటే మలబద్ధకం తగ్గుతుంది. అధిక బరువు తగ్గాలనుకునే వారు ఈ పండ్లను తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అంజీర్ డ్రై ఫ్రూట్స్‌లో సహజసిద్ధమైన చక్కెరలు ఉంటాయి. ఐరన్, పొటాషియం వంటి పోషకాలు సైతం అధికంగానే ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే శరీరానికి శక్తి లభిస్తుంది. శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. ఉత్సాహంగా మారుతారు. చురుగ్గా పనిచేస్తారు. నీరసం, అలసట తగ్గిపోతాయి.

**ఎముకల ఆరోగ్యానికి..** అంజీర్ పండ్లలో క్యాల్షియం, మెగ్నిషియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. ఆర్థరైటిస్, ఆస్టియో పోరోసిస్ వంటి ఎముకల సంబంధ సమస్యలు ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అంజీర్ పండ్లను తింటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గిపోతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఈ పండ్లలో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి అంజీర్ పండ్లు మేలు చేస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. షుగర్ ఉన్నవారు సైతం ఈ పండ్లను తినవచ్చు. ఇవి తియ్యగా ఉన్నప్పటికీ వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ తక్కువ. పైగా వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ ఉంటాయి కనుక ఈ పండ్లను తింటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది.

**ఎన్ని తినాలి, ఎప్పుడు తినాలి..?** అంజీర్ డ్రై ఫ్రూట్స్‌ను రోజుకు 2 లేదా 3 మాత్రమే తినాలి. అధికంగా తింటే జీర్ణ సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి. రాత్రి పూట 3 అంజీర్ డ్రై ఫ్రూట్స్‌ను నీటిలో నానబెట్టాలి. వాటిని మరుసటి రోజు ఉదయం పరగడుపునే తినాలి. ఇలా తినడం వల్ల వాటిల్లో ఉండే పోషకాల శాతం పెరుగుతుంది. పైగా ఉదయం తింటే రోజంతటికీ కావల్సిన శక్తి లభించి ఉత్సాహంగా ఉంటారు. అంజీర్ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక కొందరికి పొట్టలో అసౌకర్యం ఏర్పడే అవకాశం ఉంటుంది. అలాంటి వారు ఈ పండ్లను తినకూడదు. అంజీర్ పండ్లను తినడం వల్ల శరీరానికి ఐరన్ లభిస్తుంది. ఇది రక్తం తయారయ్యేలా చేస్తుంది. ఇలా ఈ పండ్లతో అనేక లాభాలను పొందవచ్చు.

సత్యమేవ జయతే



## మృతుల కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి.



సత్యమేవ జయతే/హత్నూర: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గోవిందరాజు పల్లి గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన కుటుంబ సభ్యులను ఆదివారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన కడిల ఆంజనేయులు కరెంటు షాక్ తో మృతి చెందగా, బండమీది రాజు తల్లి సత్యమ్మ అనారోగ్యంతో మరణించగా వారి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కరెంట్ షాక్ తో మృతి చెందిన ఆంజనేయులు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. పార్టీ నాయకులకు కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కర్రె కృష్ణ, నాయకులు సత్యం, కొన్యాల వెంకటేశం, ఎంఏ హకీం, గుర్రాల మల్లేశం, మణిదీప్, సాయి,సందీప్, శివరాజ్, మోదుగుల శ్రీశైలం,గోపాల్, నాగేష్,రాములు, శ్రీశైలం, పంబాల నర్సింలు, సాయికుమార్,అశోక్,రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలు.




సత్యమేవ జయతే/హత్నూర: మండల కేంద్రమైన హత్నూర లో ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ ఆత్మ గౌరవ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైసగళ్ల బుచ్చంద్ర పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటంలో 31 సంవత్సరాలను వ్యవస్థాపకులు,పద్మశ్రీ మందకృష్ణ మాదిగ స్ఫూర్తితో మాదిగల ఆత్మగౌరవం తీసుకొచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడంతో 59 ఉపకులాలకు సమన్యాయం జరిగిందని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో ఎన్నో సమస్యలపై పోరాటం చేసిందన్నారు. భవిష్యత్తులో రాజ్యాధికారం కోసం సంబంధ పేద వర్గాలను ఐక్యం చేస్తూ మందకృష్ణ మాదిగ పోరాటంలో అన్ని అగ్రకులాల పేద ప్రజలు భాగస్వాగము కావాలన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో వచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల చేయూత పింఛన్ల మహాగర్జన బహిరంగ సభ ఈ నెల 13న చలో హైదరాబాద్ లో ఉంటుందని సబ్బండ వర్గాలు కలిసికట్టుగా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, మొగులయ్య, సాయిలు,పెంటయ్య,నరేందర్, బాలకిషన్,లక్ష్మీనారి,దుర్గా దాస్, ప్రభు,మల్లేష్, నర్సింలు, ఎల్లయ్య,దశరథ్,నాగేష్, రామలింగం,నారాయణ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన కూచిపూడి నాట్య కళాకారులు..

### వడ్డేపల్లి రాజేశ్వరరావు




**సత్యమేవ జయతే,ఆగస్టు 3, కుత్బుల్లాపూర్ ప్రతినిధి :**కుచిపూడి నాట్యకళలో తన అపారమైన ప్రతిభను చాటుతూ.. కేరళ రాష్ట్రంలోని కాలికట్‌లో నిర్వహించిన అఖిల భారత నృత్య పోటీలో బహుమతులు గెలుచుకుని రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన గురువు కుమారి ప్రణవి తూమాటి అని వడ్డేపల్లి రాజేశ్వరరావు కొనియాడారు. ఈ వేడుకలో ఆమెకు శాస్త్రీయ నృత్యకళ సమ్మాన్ పురస్కారం లభించడమే కాకుండా, ఆమెను ఈ ఉత్సవ వేడుకల్లో అత్యుత్తమంగా నిలిచిన టాప్ శార్క్ 3 లో ఒకరిగా కూడా ఎంపిక చేయడం ఎంతో గర్వకారణం అన్నారు. అంతేకాకుండా ఆమె శిష్యులు సీనియర్ విభాగం: హర్షిత %-% 2వ బహుమతి, జూనియర్ విభాగం: శ్రీ విద్య %-% 2వ బహుమతి, హిమవర్షిత %-% 2వ బహుమతి, సబ్ జూనియర్ విభాగం: 1వ బహుమతి విజేత: సహస్ర, మరియు సబ్ జూనియర్ విభాగం: ప్రదీక్ష %-% 2వ బహుమతి సాధించారని కొనియాడారు. ఈ సందర్భంగా వారందరిని ఆదివారం వివేకానంద నగర్ అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణలో వడ్డేపల్లి రాజేశ్వరరావు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఇంచార్జ్ సుదర్శన్, ప్రధాన అర్చకులు యోగేశ్వర శర్మ, నరేష్ శర్మ, రాజా,కేశవ శర్మ అలాగే ఇతర విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బర్త్‌డ్ వేడుకల్లో డ్రగ్స్ పార్టీ.. చేవెళ్ల ఫామ్‌హౌస్‌లో ఆరుగురు ఐటీ ఉద్యోగులు అరెస్ట్



సత్యమేవ జయతే – రంగారెడ్డి రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో డ్రగ్స్ పార్టీ కలకలం సృష్టించింది. సెరీన్ ఆచార్జ్ ఫామ్‌హౌస్‌లో బర్త్‌డే వేడుకల పేరుతో డ్రగ్స్, విదేశీ మద్యంతో ఐటీ ఉద్యోగులు సెలబ్రేట్ చేసుకున్నారు. విస్వనీయ సమాచారం అందడంతో ఎస్‌టీఎఫ్ బీ టీమ్, ఎక్సైజ్ పోలీసులు ఫామ్‌హౌస్‌లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2 లక్షల విలువైన డ్రగ్స్‌తో పాటు 3 లగ్జరీ కార్లను సీజ్ చేశారు. బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న వారికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. ఆరుగురు ఐటీ ఉద్యోగులకు పాజిటివ్ రావడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు.
బర్త్‌డే సందర్భంగా ఐటీ ఉద్యోగి అభిజిత్ బెనర్జీ ఫామ్‌హౌస్‌ను బుక్ చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. డ్రగ్స్‌ను హిమాచల్‌ప్రదేశ్ నుంచి తీసుకొచ్చినట్లు గుర్తించామన్నారు. ఫామ్‌హౌస్ నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశామన్నారు.

# అపరిశుభ్రంగా ఉన్న సహాయ వ్యవసాయ సంచారకుల వారి కార్యాలయం





**చెత్తా చెదారంతో నిండిపోయిన ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు**

**దోమలు, ఈగల తో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం**

**ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలంటున్న ప్రజలు**

**పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు**

సత్యమేవ జయతే, వికారాబాద్ ప్రతినిధి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సహాయ వ్యవసాయ సంచాలకుల వారి కార్యాలయ పరిసరాలు చెత్తా చెదారంతో నిండిపోయి ఉండడంతో రైతులు, ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదర్శంగా ఉండవలసిన ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు చెత్తా చెదారంతో నిండిపోవడంతో ఈగలు, దోమలు ఉండి ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో చెత్తాచెదారం కుళ్లిపోయి అక్కడి పరిసరాలలో దుర్వాసన వస్తుందని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. చెత్తా చెదారంతో నిండిపోయిన ప్రభుత్వ కార్యాలయాల దగ్గర ఈగలు దోమలు ఉండడంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. సహాయ వ్యవసాయ సంచారకుల వారి కార్యాలయం తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ప్రోటోకాల్ పేరుతో చిల్లర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదు

**విలేకరుల సమావేశంలో టి పి సి సి మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఎంఏ హకీమ్**

**మహిళా అధ్యక్షురాలు సుజాత**

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కర్రె కృష్ణ**




సత్యమేవ జయతే/హత్నూర: ప్రజా పాలన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని చించేసిన బిఆర్ఎస్ దుండగులను వెంటనే అరెస్టు చేయాలని టిపిసిసి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీమ్, మహిళా అధ్యక్షురాలు సుజాత సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కర్రె కృష్ణ,డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన హత్నూర లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి ప్రోటోకాల్ పేరుతో చిల్లర రాజకీయాలకు చేయడం సరికాదని. సీఎం ఫ్లెక్సీ ని చించటానికి ప్రోత్సహించిన ఎమ్మెల్యే పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ ప్రజల ముందుకు పోతుంటే ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ కార్యకర్తలను ఉసిగొలుపుతూ రాజకీయం చేయడం సహించేది లేదని కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మీ సీఎం చిత్రపటాన్ని బిఆర్ఎస్ నాయకులు చించేసిన వీడియో ఉండంగా కూడా కాంగ్రెస్ నాయకులే చించేశారు అంటూ సంబోధించడం ఎంతవరకు సమంజసం ఉన్నారు. రాష్ట్రంలో ఇద్దరు సీఎంలు ఉన్నారని భ్రమ పడుతున్నారని బ్రమా నుంచి బయటకు రావాలన్నారు. రాజకీయ బిక్ష పెట్టిన కాంగ్రెస్ పై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రాజిరెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రోటోకాల్ పేరుతో పోలీసులను అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తే గ్రామాల్లోకి రానీయరని హెచ్చరించారు. సీఎం ఫ్లెక్సీ ని చించేసిన బీఆర్ఎస్ దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరస్వామి గౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ యువజన నాయకులు మణిదీప్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకొని తీరుతాం..

**రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**

**- ఆ ప్రాజెక్టు నిర్మాణం జరగకుండా ఎంతటి పోరాడటానికైనా సిద్ధం**

**- ధర్మారంలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు మంత్రులు తుమ్మల, అడ్లూరి, పొన్నం పర్యటన**

**- కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఐటీఐ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన**





సత్యమేవ జయతే – కరీంనగర్ కరీంనగర్ : గోదావరి నదిపై అనుసంధానంగా ఏపీ ప్రభుత్వం అక్రమంగా నిర్మించే తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును తమ ప్రభుత్వం అడ్డుకొని తీరుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో పర్యటించారు.స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయడంతో పాటు రూ.45.1 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఐటీఐ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షత వహించగా ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి నదికి అనుసంధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్రమంగా నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన వెల్లడించారు. తాను సిడబ్ల్యుసి కి లేఖ రాయడంతో కేంద్ర ప్రభుత్వం అట్టి ప్రాజెక్టు నిర్మాణానికి అభ్యంతరం తెలిపిందని ఆయన తెలిపారు.అదేవిధంగా ఇటీవల ఢిల్లీలో కేంద్ర జల వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రి హాజరుకాగా సీఎం రేవంత్ రెడ్డి తో పాటు తాను ఆ సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డు చెప్పామని ఆయన వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని ఎంతటి పోరాటానికైనా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన ప్రకటించారు. రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్ చేసిన వినతి మేరకు స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి రిజర్వాయర్ నిర్మాణం చేయడానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ ప్రాజెక్టు నిర్మాణం కోసం డి పి ఆర్ తయారు చేయడానికి రూ. 1కోటి 10 లక్షల నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.
అదేవిధంగా ఈ ప్రాజెక్టు పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క తో పాటు తాను ఇట్టి రిజర్వాయర్ నిర్మాణం కోసం నిధుల కేటాయింపు కోసం కృషి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. అదేవిధంగా అర్థాంతరంగ నిలిచిన నంది రిజర్వాయర్ లింక్ కాలువ నిర్మాణానికి రూ.3.26 కోట్లు, కొత్తపల్లి గ్రామానికి ఎస్సారెస్పీ డి 83/బి 1ఎల్ కాలువ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిన నేపథ్యంలో భూసేకరణ కోసం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేస్తామని ఆయన ప్రకటించారు. యశ్వంతరావు పేట చెరువు పూడిక తొలగించడం, అక్కేపల్లి లిఫ్ట్ పూర్తి చేయించడం, గోదావరి నదికి అనుసంధానం ఉన్న 6 లిఫ్టుల మరమ్మ కోసం రూ.82 లక్షల కేటాయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

– పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపడుతాం : మంత్రి లక్ష్మణ్‌కుమార్

రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల ఉపాధి అవకాశాల కోసం ధర్మారం మండలానికి ఐటిఐ కళాశాల మంజూరు చేయించడంతోపాటు భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.45.15 కోట్ల నిధులను మంజూరు చేయించడం ఆనందంగా ఉందని అన్నారు. అదేవిధంగా పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం కోసం డిపిఆర్ తయారు చేయడానికి ప్రభుత్వం చేయడం హర్షనీయమని అన్నారు. తన పదవి కాలంలో మండలంలో అనేక అభివృద్ధి పనులు చేస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆయిల్‌ఫామ్ తోటల సాగు పెంచాలి : మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నీటి అవసరం ఎక్కువగా ఉన్న వరి,పత్తి, మిర్చి సాగును రైతులు తగ్గించడమే శ్రేయస్కరమని అన్నారు. నీటి అవసరం తక్కువగా ఉన్న ఆయిల్ పామ్ తోటలు సాగు చేసి ఆర్థికంగా రైతులు ఎదగాలని అన్నారు. తాను కూడా ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తున్నానని ఉదాహరణ అని ఆయన చెప్పుకొచ్చారు. సిద్దిపేట జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని నెలకొల్పుతామని తదనంతరం జిల్లాకు ఒక ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

– ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం.. : మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మహాలక్ష్మి పథకం లో భాగంగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయడానికి అవకాశం కల్పించామని అన్నారు. అదేవిధంగా తమ ప్రభుత్వం గురుకులాలు, వసతి గృహాలు నివాసం ఉండే విద్యార్థుల మెస్ చార్జీలను పెంచిందని, గృహ జ్యోతి ద్వారా ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచితంగా విద్యుత్తును అందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, అడిషనల్ కలెక్టర్ వేణు, డీసీఎస్ఓ శ్రీనివాస్, డీపీవో వీర బుచ్చయ్య, ఐటీఐ ఆర్డీడీ సీతారాం , పెద్దపల్లి ఐటిఐ కళాశాల కన్వీనర్ బి. వెంకట్ రెడ్డి, ఎంపీడీవో అయినాల ప్రవీణ్ కుమార్, ఇన్చార్జి తహసిల్దార్ ఉదయ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ లావుడియా రూప్ల నాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ను ఆవిష్కరణ చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.సన్మానం చేసిన అంబేద్కర్ యువజన సంఘ%శీ% నాయకులు. ఎమ్మెల్సీ దయాకర్..







సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..మర్పల్లి మండలం పట్లూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 16 అడుగుల డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి విగ్రహాన్ని ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ .
పాల్గొన్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ , ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం గారు, , స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు.
విగ్రహ దాత, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని ఘనంగా సన్మానించిన పట్లూరు గ్రామస్తులు.
గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు.
చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డి గారితో కలిసి వికారాబాద్ కు నవోదయ పాఠశాలను మంజూరు చేయించాను, వచ్చే ఏడాది నుండి ప్రారంభం అవుతుంది- స్పీకర్ ప్రసాద్ కుమార్ తెలిపారు.
వికారాబాద్ నియోజకవర్గం మీదుగా వెళ్ళే నాలుగు రాష్ట్ర రహదారులను పదివేల కోట్లతో జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నాను—స్పీకర్ ప్రసాద్ కుమార్.అన్నారు. ఈ కార్యక్రమం లో అంబేద్కర్ సంఘ%శీ% నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యాత్మతీర్థుల వారిని దర్శించుకున్న పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి..



సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా.. హైదరాబాద్ కాచిగూడలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో జరుగుతున్న శ్రీమదుత్తరాది మఠాధిపతి,పీఠాధిపతి పూజ్య శ్రీ 1008 శ్రీ సత్యాత్మతీర్థ శ్రీపాదుల వారి 30వ చాతుర్మాస్య మహోత్సవంలో పరిగి ఎమ్మెల్యే %ు% డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు హాజరై,పూజ్య స్వామీజీలను దర్శించుకుని వారి ఆశీస్సులు పొందారు.స్వామీజీల సన్నిధిలో కొంతసేపు గడిపి,వారి ఆశయాలు, ఆధ్యాత్మికతపై నమ్మకాన్ని వ్యక్తపరిచారు..

# కాంగ్రెస్ పాదయాత్ర విజయవంతం తట్టుకోలేక బిఆర్ఎస్ నాయకుల విమర్శలు...

**10.ఏళ్ల లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బి ఆర్ ఎస్ రాష్ట్ర ప్రభుత్వం.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమా లను చూసి ఓర్వలేక లేని పోనీ ఆరోపణలు... పరిగి కాంగ్రెస్ పార్టీ నాయకుల హెచ్చరిక...**





. సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..ఆదివారం ఎమ్మెల్యే డా టి రామ్మోహన్ రెడ్డి గ నివాసం లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పత్రికా సమావేశం నిర్వహించడం జరిగింది..
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా హితం కోసం ప్రభుత్వం లో ఉన్న కుడా ప్రజలతో మమేకం కావాలని ప్రభుత్వంలో ఉన్న పార్టీ ప్రజల కోసం ప్రజా పాలనే లక్ష్యంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్ర లో ముఖ్య అతిథిగా ఎఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్. ప్రతి ఉమ్మడి జిల్లాలో ఒక నియోజకవర్గంలో 10 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించాలని నిశ్చయించి ఎమ్మెల్యే డా టి రామ్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో పరిగి నియోజకవర్గంలో రంగాపూర్ నుండి పరిగి వరకు చేసి స్వతహాగా వేలాదిమంది ప్రజలు తరలివచ్చి పాదయాత్రను విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా ఆ పది కిలోమీటర్ల పాదయాత్రలో ఎంతోమంది పేదలను కలిశారని వారికి అందుతున్న ప్రభుత్వ పథకాల గురించి మాట్లాడారని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత గత పది సంవత్సరాల బి ఆర్ ఎస్
పాలనలో ప్రజలకు చేసిన 8 లక్షల కోట్ల అప్పు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల వరకు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూ కే సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు, రైతు భరోసా, భూమి లేని వారికి ఆత్మీయ భరోసా, 60 వేల ఉద్యోగాలు, మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు, 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ, ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అభివృద్ధిని 19 నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో చేసి చూపించిందని తెలిపారు..పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు గాని ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు గాని ఇవ్వని వాళ్ళు మీడియా సమావేశం పెట్టి ప్రజా సంక్షేమం గురించి మాట్లాడుతుంటే విడ్డూరంగా ఉందని తెలిపారు.
గత పది సంవత్సరాల పాలనలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని వికారాబాద్ జిల్లాకు ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇవ్వలేదని జిల్లాకు రావలసిన సాగునీరు ప్రాజెక్టులను రద్దుచేసి కల్వకుంట్ల కుటుంబ సభ్యులు పరిపాలిస్తున్న నియోజకవర్గాలకు ప్రాజెక్టులు తరలించుకొని పోయారని ఇవన్నీ చేస్తుంటే అప్పుడు ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యేలు చూస్తూ ఊరుకున్నారే తప్ప ఈ ప్రాంత అభివృద్ధికి ఏనాడు ప్రభుత్వంతో కొట్లాడలేదని తెలిపారు..
ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ గురించి ప్రభుత్వం పై విమర్శలు చేసే ముందు మీరు 10 ఏళ్ల పాలనలో ఈ ప్రాంతానికి ఎలాంటి అభివృద్ధి చేశారో చెప్పాలని, పేదలకు సన్న బియ్యం ఇస్తానని మాట ఇచ్చి మాట తప్పిన మీరు నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు ఇవ్వకుండా నోటిఫికేషన్ ఇవ్వకుండా వాళ్ల జీవితాలతో చెలగాడం ఆడిన మీరు.. ప్రజాహితం కోసం ప్రజా సంక్షేమం కోసం ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజాహిత పాదయాత్ర పై మీరు విమర్శలు చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎవ్వరూ చూసుకుంటూ ఊరుకోరని తగిన బుద్ధి చెప్పడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.
ప్రభుత్వం లో ఉన్నా, ప్రతిపక్ష హోదాలో ఉన్న కేసీఆర్ ఫామ్ హౌస్ లో పండుకొని ప్రజల సమస్యలు గాలికి వదిలేసి అసెంబ్లీకి రాకుండా అధికారమే దాహం తో ఉన్న మీరు మీ నాయకుని గురించి మొదట మీరు మాట్లాడి తర్వాత వేరే వాళ్ళను విమర్శిస్తే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు.
గత పది ఏళ్ల పాలనలో వికారాబాద్ జిల్లాకు జరిగిన అన్యాయం ఈ రాష్ట్రంలో ఏ జిల్లాకు జరగలేదు. ఏ ఒక్క పెద్ద ప్రాజెక్టు రాలేదు ఏ రోడ్డు అభివృద్ధి చెందలేదు రాబందుల లాగా పేదల భూములు లాక్కొని, రియల్ ఎస్టేట్ దండ చేస్తూ ఎమ్మెల్యేలు డబ్బులు సంపాదించారే తప్ప ఈ ప్రాంత అభివృద్ధి గురించి ఏనాడు కూడా బిఆర్ఎస్ పార్టీ నాయకులు పనిచేయలేదు అని తెలిపారు.
కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇయ్యాలని అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపారని కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేసి రిజర్వేషన్లు సాధించడానికి కాంగ్రెస్ పార్టీ కృత నిశ్చయం తో ఉందని ఈనెల 5 6 7 తేదీలలో ఢిల్లీలో ధర్నాలకు పిలుపు ఇచ్చి రిజర్వేషన్లను సాధన లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో పనిచేస్తున్నారని ఈ విషయాన్ని టిఆర్ఎస్ నాయకులు ఏ రోజు కూడా మద్దతు పలకకుండా బీసీలకు న్యాయం చేయాలని ఏమాత్రం ఆలోచన లేకుండా పదేళ్లు అధికారంలో ఉండి ఏనాడు బీసీలను పట్టించుకోకుండా నేడు రిజర్వేషన్ల అమలు కోసం ఏమాత్రం సపోర్ట్ చేయకుండా విమర్శిస్తున్నారని తెలిపారు..
ప్రజా ప్రభుత్వంలో ప్రజల మేలు కోసం అధికారంలో ఉన్నప్పటికీ పాదయాత్రలు చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పార్టీ పటిష్టత కోసం కార్యకర్తల కోసం కచ్చితంగా పార్టీ అధ్యక్షునిగా పార్టీ ఇన్చార్జిగా వారి బాధ్యతలను నిర్వహిస్తారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.
పాదయాత్రలో భాగంగా ఏఐసీసీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ గారి దృష్టికి స్మశానంలో వృద్ధుడు జనుముల.నరసయ్య (%వా/శీ% బీమాప) తన మనవడితో కలిసి గంగపుత్ర స్మశాన వాటికలో నివాసం ఉంటున్న విషయాన్ని ఆమె కొందరి ద్వారా తెలుసుకొని వెంటనే వారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెలారు.. ఎమ్మెల్యే డా టి రామ్మోహన్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ తీసుకొని కలెక్టర్ గారితో మాట్లాడి ఆ వృద్ధుడికి మరియు వారి మనవడికి వెంటనే తక్షణ సహాయంగా మోడల్ ఇందిరమ్మ ఇంట్లో నివాసం కల్పించారని వారికి త్వరలో ఇందిర్మం ఇల్లు నిర్మాణం చేయించి ఇచ్చుటకు నిర్ణయించారని ఈ విషయాన్ని ఈ పాదయాత్ర ద్వారా తెలుసుకున్నారని బిఆర్ఎస్ నాయకులు గ్రహించాలని తెలిపారు.
పాల్గొన్నవారు బ్లాక్ 1 అధ్యక్షులు పార్థసారథి పంతులు, మార్కెట్ కమిటీ చైర్మెన్ పరశురాం రెడ్డి పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ %ఎఎ% ఉపా అధ్యక్షులు లాల్ కృష్ణ ప్రసాద్, సీనియర్ నాయకులు జమీల్, నసీరుద్దీన్, గోపాల్, పట్టణ ఉపాధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, ఏజాజ్, నియోజకవర్గ యువజన అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి జగన్, తౌర్య నాయక్, సర్వర్, అనంత రెడ్డి, రాజా పుల్లా రెడీ, అభిరామ్ పంతులు,మాజీ కౌన్సిలర్ వెంకటేష్, సీనియర్ నాయకులు ఖదీర్ భాయ్, మోయీజ్, వెంకటేష్, హరిశ్చందర్ నాయక్, గోవర్ధన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు షోయబ్, నాగవర్ధన్, ఆనంద్, రవికాంత్, శ్రీను, రాధాకృష్ణ రెడ్డి, నిఖిల్, అన్వర్, మహేష్, జంగయ్య, మహేష్, గణేష్, సురేష్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు కోసం సెల్ టవర్ ఎక్కి నిరసన

సత్యమేవ జయతే – వరంగల్ రూరల్
వరంగల్ రూరల్ : అన్ని అర్హతలున్నా తనకు ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంతో సెల్ టవర్ ఎక్కి ఓ వ్యక్తి నిరసన వ్యక్తం చేశారు. మరిపెడ మండలంలోని తానంచర్ల గ్రామానికి చెందిన బాసనపల్లి రాములు అర్హుల జాబితాలో తన పేరులేదని, తనకు ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సెల్ టవర్ ఎక్కారు. దీంతో గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకున్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు వచ్చిందని, 11వ నంబర్ అని ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు తనకు చెప్పారన్నారు. దీంతో ఇల్లు నిర్మించుకోవడానికి ప్రయత్నాలు చేపట్టే క్రమంలో మొదటి జాబితాలో పేరు లేదని చెబుతున్నారన్నారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ కమిటీ సభ్యులు మాటా దాటవేస్తున్నారని, దీంతో తీవ్ర నిరాశకు గురయ్యానని చెప్పారు. గత్యంతరం లేక గ్రామంలోని సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపిన్నట్లు వెల్లడించారు. విషయం తెలుసుకున్న స్థానికులు సెల్ టవర్ దిగాలని, ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూస్తామని తెలిపినప్పటికీ రాములు సెల్ టవర్ పైనుంచి దిగకపోవడంతో గ్రామంలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితునికి హామీ ఇచ్చినప్పటికీ.. అతడు కిందికి దిగకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రనాయక్‌కు విషయం తెలియజేశారు. దీంతో ఇల్లు వచ్చే విధంగా చూస్తానని బాధితుని భార్యకు ఫోన్‌లో ఆయన హామీ ఇవ్వడంతో రాములు సెల్ టవర్ దిగారు.



గందరగోళం సృష్టిస్తున్న ఇందిరమ్మ కమిటీ సభ్యులు..
నిరు పేదలకు సొంతింటి కలను నిజం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇండ్ల విషయంలో లబ్ధిదారులను ఇందిరమ్మ కమిటీ సభ్యులు అయోమయానికి గురి చేస్తున్నారు. తానంచర్ల గ్రామంలో లబ్ధిదారులు ఎంత మందనే విషయం ఇప్పటివరకు చెప్పడం లేదు. మీకు ఇల్లు వచ్చిందని చెప్పడమే తప్ప స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిజమైన లబ్ధిదారులకు సమాచారం అందించాలని కోరుకుంటున్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2 నంది పంపు హౌస్ ద్వారా.. ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాల ఎత్తిపోత

**- ఐదో మోటార్ ద్వారా పంపింగ్**

**- పదిన్నర గంటలపాటు గాయత్రి పంప్ హౌస్ కు నీటి తరలింపు**



సత్యమేవ జయతే - కరీంనగర్ కరీంనగర్ :కరీంనగర్ : కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ -2 అనుబంధంగా ఉన్న పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని 6వ ప్యాకేజీ పంపు హౌస్ లో ఒక మోటార్ ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాల ఎత్తిపోతను నీటిపారుదల శాఖ అధికారులు చేపట్టారు. వరద కాలువకు అనుబంధంగా ఉన్న ప్రాంతంలో వానకాలం సీజన్ లో వరి నాట్లు వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జలాలను ఎత్తిపోసే ప్రక్రియను నిర్వహించినట్లు ఆ శాఖ డీ ఈ ఈ గునిగంటి నర్సింగరావు తెలిపారు.

నంది పంపు హౌస్ లో ఆదివారం ఉదయం 7:30 గంటలకు 5వ మోటార్ ను ఆన్ చేశారు. డెలివరీ సిస్టర్న్ ద్వారా ఎగిసిపడి వచ్చిన 3,150 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలు 7వ ప్యాకేజీ లోని నంది రిజర్వాయర్ లోకి పంపింగ్ చేశారు. అదే పరిమాణంలో ఈ రిజర్వాయర్ నుంచి జంట సొరంగాల ద్వారా 8వ ప్యాకేజ్ లోని కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని గాయత్రి పంప్ హౌస్ కు తరలించారు. అక్కడ 6వ మోటార్ ను ఆన్ చేయడంతో జలాలు వరద కాలువలోకి సరఫరా చేశారు. కాగా ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలనుసారం సాయంత్రం 5:55 నిమిషాల సమయంలో నంది పంప్ హౌస్ లోని మోటార్ ను నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు నిలిపివేశారు. సుమారు 10:30 గంటల పాటు నీటి ఎత్తిపోతలు జరగగా 0.15 టీఎంసీ నీరు తరలినట్లు డి ఈ ఈ నర్సింగరావు వెల్లడించారు.

## బ్యాగులో డబ్బు, బంగారం.. విద్యుత్ శాఖ ఉద్యోగి నిజాయితీకి అధికారుల అభినందనలు



సత్యమేవ జయతే - మధిర

మధిర : మధిర పట్టణంలో విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బాబురావు అనే ఉద్యోగి నిజాయితీని చాటుకోవడంతో పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు అభినందించారు. ఆదివారం మధిర పట్టణం సిద్ధారెడ్డి బజార్ ప్రాంతంలో బాబురావు విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆ ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో, నిర్మానుష్య ప్రదేశంలో ఒక బ్యాగు అతనికి కనిపించింది.

బాబూరావు అనుమానం వచ్చి ఆ బ్యాగును తెరచి చూచాడు. దానిలో డబ్బుతోపాటు బంగారం కూడా ఉండడం గమనించి, తక్షణం ఆ బ్యాగు తీసుకొని పట్టణ పోలీస్ స్టేషన్ నందు సిఐ రమేష్‌కు అప్పగించారు. సిఐ రమేష్ బ్యాగు పోగొట్టుకున్న వారి వివరాలను సేకరించి సంబంధిత బ్యాగు యజమానిని గుర్తించి.. వారిని స్టేషన్‌కు పిలిపించారు.

బ్యాగు పోయిన విధానం తెలుసుకొని, వారికి విలువైన బంగారం, నగదుతో కూడిన బ్యాగును జూనియర్ లైన్‌మెన్ బాబురావుతోపాటు పట్టణ లైన్ ఇన్‌స్పెక్టర్ రాజా రత్నం సమక్షంలో యజమానికి బ్యాగు అప్పగించారు. ఈ సందర్భంగా మధిర పట్టణ సీఐ రమేష్ జూనియర్ లైన్‌మెన్ బాబురావు నిజాయితీకి మెచ్చుకొని, పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శాలువాతో సన్మానం చేసి అభినందించారు. ఇదే క్రమంలో విద్యుత్ శాఖ వైరా డివిజన్ డీఈ బండి శ్రీనివాసరావు, ఏడీఈ ఎం అనురాధ , మధిర పట్టణ ఏఈఎస్, అనిల్ కుమార్ ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది బాబురావుని అభినందించారు.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : ముస్లిం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ



సత్యమేవ జయతే - ఖమ్మం ఖమ్మం : ముస్లిం ఐక్యత సంఘం ద్వారా ఐక్యత భావాలను పెంపొందించాలని ముస్లిం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు, మౌలానా ముజాహిద్ ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్ సాహెబ్ కోరారు. ఆదివారం మండలంలోని గోవిందాపురం ఎల్ గ్రామంలో ధార్మిక సభ మండల అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ధార్మిక విద్యను అభ్యసించి మంచి పౌరులుగా మెలగాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ప్రాపంచిక జ్ఞానంతోపాటు ధార్మిక విద్యను నేర్పించాలని సూచించారు. నైతిక విలువలు పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు.

ముస్లిం సమాజం అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నదని.. ఆర్థికంగా ,సాంఘికంగా ,రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ముస్లింలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ కార్యదర్శి అఫ్రోజ్ అహ్మద్ అఢ్గొసుద్దీన్,మండల ప్రధాన కార్యదర్శి చాంద్సాహెబ్, ఉపాధ్యక్షులు షాజహాన్, కార్యదర్శి రఫీ, దస్తగిర్, సభ్యులు బాబు, షరీఫ్, మజీద్ కమిటీ అధ్యక్షులు జానిమియా,సభ్యులు రంజాన్, మధార్, సలీం, నాగులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ స్నేహం చాలా స్పెషల్.. ఎంత బిజీగా ఉన్నా కలవాల్సిందే



సత్యమేవ జయతే - వరంగల్ రూరల్

వరంగల్ రూరల్ : ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిసాము చదువులమ్మ తల్లి నీడలో అని సినీ కవి రాసిన పాటకు నిలువెత్తు నిదర్శనం ఈ దృశ్యం. సింగరేణి హైస్కూల్ రుద్రంపూర్ విద్యార్థులు, పదవ తరగతి చదివి 31 సంవత్సరాలు అయిపోయినప్పటికీ, ప్రతి సంవత్సరం స్నేహితుల దినోత్సవం అంటే అందరూ ఎక్కడ ఉన్న, ఎన్ని పనులున్నా, బాధ్యతలను పక్కకు పెట్టి, బాధ్యతగా స్నేహితుల దినోత్సవాన్ని ఒకచోట కలిసి సెలబ్రేట్ చేసుకుంటారు, స్నేహితులంటే మీరే అన్నట్టు వీరంతా ఆదర్శంగా నిలుస్తున్నారు.

సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని గతంలో ఉన్న రుద్రంపూర్ సింగరేణి హై స్కూల్ లో 1993 -1994 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకుని, ఉన్నత చదువుల కోసం వారందరూ విడిపోయి, ఆయా రంగాల్లో స్థిరపడ్డారు. కొందరు ఉన్నత స్థానాల్లో ఉంటే మరికొందరు పలు ఉద్యోగాలు, పనుల్లో ఉన్నప్పటికీ వారు ప్రతి సంవత్సరం స్నేహితుల దినోత్సవ సందర్భంగా తప్పకుండా కలుసుకుంటారు. తమ తమ హోదాలను తమ అంతస్తులను పక్కకు పెట్టి, డ్రెస్ ధరించి ధరిస్తారు.

తమ దుస్తుల్లో, తమ చేష్టలలో ఎక్కడ కూడా తమ హుందాతనం ఆగుపడకుండా.. తాము అందరం ఒకటే అనే భావన కల్పించినందుకు ప్రతీ సంవత్సరం తాము చదువుకున్న స్కూల్ పేరుతో ఉన్న టీ షర్టులను ధరించి, అన్ని మరిచి తమ స్నేహితులతో గడుపుతారు, ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకుంటారు. తమలో ఎవరైనా ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే అండగా నిలుస్తారు. ఆర్థికంగా బాగా లేని స్నేహితుల పిల్లల చదువులకు అయ్యే ఆర్థిక సహాయం కూడా వారు అందించుకుంటారు.

- ప్రతీ సంవత్సరం ఇలా కలుసుకోవడం..

తమకు ప్రాంతము, జాతి ,మతం అనేవి తమ దరిదాపులో ఉండవని.. ప్రతీ సంవత్సరం ఇలా కలుసుకోవడం వల్ల యోగక్షేమాలు తెలుసుకోవడమే కాకుండా ఎవరెవరికి ఏ అవసరాలు ఉన్నాయి. ఈ సంవత్సరంలో ఏం చేస్తే బాగుంటుందని చర్చించుకుంటామని తెలిపారు. ప్రతీ సంవత్సరం ఏదో ఒక ప్రాంతంలో ఫ్రెండ్‌షిప్ డే పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహించుకుంటారు.

ఆదివారం స్నేహితుల దినోత్సవం పాములేరులో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు నిర్వహించుకొని, ఆటపాటతో ఆనందంగా గడిపారు ఈ కార్యక్రమంలో హనోక్ రాజ్, జోసఫ్, ఆది రామచందర్, కోడం వరప్రసాద్, బూర్గుల రాంద్రప్రసాద్, కంచె శ్రీనివాస్,బొక్క రామకృష్ణ, బొంతు శ్రీనివాస్, కుక్కల సారయ్య, నూతన్ బాబు, విజయ రాజు, మాతంగి రవికుమార్, సంగం రమేష్, పీటర్ రామకృష్ణ, సదానందం, బి .రవి కుమార్, హరిబాబు తదితరులు ఉన్నారు.

# కర్షకుల కన్నెర్ర.. జాతీయ రహదారిపై కొడంగల్ భూ నిర్వాసితుల రాస్తారోకో



సత్యమేవ జయతే - నారాయణపేట

నారాయణపేటనారప్ : కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు ఆదివారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. భూములకు బేసిక్ ధర నిర్ణయించేందుకు కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కాట్రేపల్లి, ఎర్నాగానిపల్లి, కాచ్‌వార్ గ్రామాల రైతులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మక్తల్, ఊట్కూర్ మండల కేంద్రాల్లో రైతులు ప్రధాన రహదారులపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల నిరసనలో అఖిలపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు. లగచర్ల రైతులకు ఇస్తున్న పరిహారమే నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల భూ నిర్వాసితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌కు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కాట్రేపల్లి నుంచి నారాయణపేట జిల్లాలోని కాన్కుర్తి గ్రామం వరకు ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని, ఎత్తిపోతల వల్ల భూముల కోల్పోతున్న రైతులకు, మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించిన తర్వాతనే, భూ సేకరణ చేపట్టాలని కోరారు.

రైతుల ఇబ్బందులను పట్టించుకోకుండా, రైతులకు తెలియకుండానే రైతుల పొలాల్లోకి వచ్చి సర్వేలు చేయడం, రైతుల వద్ద అవార్డు కాపీలపై బలవంతంగా సంతకాలు చేయాలని ఇబ్బందులకు గురి చేయడం దారుణమని ఆరోపించారు. భూముల కోల్పోయే రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారంగా న్యాయమైన పరిహారం వస్తే తప్ప, భూములు ఇవ్వబోమని స్పష్టం చేశారు. రాస్తారోకో వల్ల ఇరువైపుల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

# ఎంపీ మల్లు రవి క్షమాపణ చెప్పాలని కురువ సంఘం



సత్యమేవ జయతే - కొల్లాపూర్

కొల్లాపూర్ : మంత్రుల పర్యటన సందర్భంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో శనివారం జరిగిన కార్యక్రమాల్లో ఎంపీ మల్లు రవి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో వివాదస్పదంగా మారుతున్నాయి. బహిరంగసభలో మల్లు రవి మాట్లాడుతుండగా సభకు అధ్యక్షత వహించిన మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ సమయభావం లేదని, ఉపన్యాసం ముగించాలని మల్లు రవికి స్లిప్ ద్వారా విన్నవించాడు.

ఇది చదువుకున్న మల్లు రవి నరసింహపై అసహనం వ్యక్తం చేస్తూ నిన్నెవరూ స్టేజీ ఎక్కించారని, ' చేపల కూర, చికెన్ కర్రి తినడానికి రాలేదని ' ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆదివారం కొల్లాపూర్ నియోజక వర్గం మదాసి మదారి కురువ కుల సంఘ నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎంపీ మల్లు రవి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నియోజకవర్గంలో ఆందోళనలు చేపడుతామని కురువ సంఘం జిల్లా నాయకులు మల్లయ్య బీరయ్య, ధర్మయ్య రాంబాబు, ఓరి వెంకటస్వామి, దుబాయ్ స్వామి కొల్లే ఈశ్వర్, నాగరాజు, తరుణ్ హెచ్చరించారు.

- మండల కమిటీ ఎన్నిక

పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో మాదాసి కురువ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు ఒరేయ్ నాగమల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా బెటరీ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కొల్లే ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా బీరయ్య, కార్యదర్శిగా నాగ మల్లయ్య, కోశాధికారిగా కొల్లే తిరుపతయ్య, సహాయ కార్యదర్శిగా శారదా మల్లేష్, వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా శారద రాముడు, పెద్ద మల్లయ్య, రాముడు, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బర్తడ్ వేడుకల్లో డ్రగ్స్ పార్టీ.. చేవెళ్ల ఫామ్‌హౌస్‌లో ఆరుగురు ఐటీ ఉద్యోగులు అరెస్ట్

సత్యమేవ జయతే - రంగారెడ్డి రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో డ్రగ్స్ పార్టీ కలకలం సృష్టించింది. సెరీన్ ఆచార్జ్ ఫామ్‌హౌస్‌లో బర్తడే వేడుకల పేరుతో డ్రగ్స్, విదేశీ మద్యంతో ఐటీ ఉద్యోగులు సెలబ్రేట్ చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్‌టీఎఫ్ బీ టీమ్, ఎక్సైజ్ పోలీసులు ఫామ్‌హౌస్‌లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2 లక్షల విలువైన డ్రగ్స్‌తో పాటు 3 లగ్జరీ కార్లను సీజ్ చేశారు. బర్తడే వేడుకల్లో పాల్గొన్న వారికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. ఆరుగురు ఐటీ ఉద్యోగులకు పాజిటివ్ రావడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు.బర్తడే సందర్భంగా ఐటీ ఉద్యోగి అభిజిత్ బెనర్జీ ఫామ్‌హౌస్‌ను బుక్ చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. డ్రగ్స్‌ను హిమాచల్‌ప్రదేశ్ నుంచి తీసుకొచ్చినట్లు గుర్తించామన్నారు. ఫామ్‌హౌస్ నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశామన్నారు.



సత్యమేవ జయతే
సోమవారం 04 ఆగస్టు 2025

# బిసి ఎస్సి ఎస్టీ లు, మైనారిటీ లు ఎలా లీడర్స్ కావాలి



**బిసి ఎస్సి ఎస్టీ లు, మైనారిటీ లు**

**ఎలా లీడర్స్ కావాలి**

**ఎలా పారిశ్రామిక వేత్తలు కావాలి : నేటివ్**

**ఇండియాన్స్ ఫోరం**

**జాతీయ అధ్యక్షులు బీరయ్య యాదవ్**

సత్యమేవ జయతే – సంగారెడ్డి సంగారెడ్డి : ఆదివారం నాడు న్యూ బస్టాండ్ దగ్గర ఐబీ కి ఎదురుగా టిపిటిఎఫ్ టీచర్స్ ఉపాధ్యాయ భవన్ లో మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. బిసి ఎస్సి ఎస్టీ లు, మైనారిటీ లు మిత్రులు శ్రేయోభిలాషు లతో హాజరు కావడం జరిగింది. భారత్ ఛాంబర్ అఫ్ కామర్స్ %డ% ఇండస్ట్రీ జాతీయ ప్రెసిడెంట్డా : సుదర్శన్ హైదరాబాద్ గారు బిసి ఎస్సి ఎస్టీ లు, మైనారిటీ లు ఎలా లీడర్స్ కావాలి అనే అంశం పై వారు మాట్లాడటం జరిగింది. ఎలా పారిశ్రామిక వేత్తలు కావాలని వారు మాట్లాడటం జరిగింది. బిజినెస్ మ్యాన్ లు తయారు కావాలనే అంశం పైప్రసంగం చేయడం జరిగింది. మీటింగ్ కి వచ్చిన ప్రతి ఒక్కరు బంగారు అవకాశం ఉపయోగించుకోవాలని భావించడం జరిగింది. సమాజం లో బహుగా గొప్ప వ్యక్తులుగా ఎదగాలానే లక్ష్యం తో నేటివ్ ఇండియాన్స్ ఫోరుమ్ని చేస్తుంది అన్నారు. ఎన్ఐవిఎఫ్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ పల్వనూరి శేఖర్, నేటివ్ ఇండియాన్స్ ఫోరం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బత్తుల విక్రమ్, పులే మార్యంట్పి డైరెక్పిటర్ నగరాని, మల్లయ్య, సర్పంచ్ లు మానయ్య, మారుతీ, నారాయణ, అంజన్న... కార్మిక సంఘం నాయకులు రాజు ముదిరాజ్, రాహుల్ నరేందర్, దండే యాదగిరి అంజద్ శేఖర్ జర్నలిస్ట్ లు పాండు, సాయిలు తదితరులు పాల్గొన్నారు

## అశోక్‌నగర్ ప్రాంతాల్లో పోలీసులు నిర్భంధం.. పలువురు నిరుద్యోగుల అరెస్టులు..



సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : నిరుద్యోగులు ఎలాంటి ధర్నాలు, నిరసనలకు పిలుపునివ్వకపోయినా ఆదివారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులు నిర్భంధించారు. పలువురు నిరుద్యోగులను అరెస్టు చేసి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగులు రవి రాథోడ్, విశాల్, నితీష్, నవీన్, అమర్‌ను అక్రమంగా అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నాయకుడు రవి రాథోడ్ మాట్లాడుతూ.. ఎలాంటి ధర్నాలకు, నిరసనలకు పిలుపునివ్వకపోయినా.. చిక్కడపల్లి ,అశోక్ నగర్ ప్రాంతాల్లో మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఒక ససంవత్సరం కావడంతో శనివారం గాంధీగనర్‌లో పిండ ప్రదానం కార్యక్రమాన్ని చేశారు. దీంతో ప్రభుత్వం అక్కసుతో పోలీసుచేత నిరుద్యోలను అక్రమంగా అరెస్టు చేయించిందని మండిపడ్డారు. 2024 ఆగస్టు 2న అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ విడుదల చేశారని అదే రోజు అసెంబ్లీలో కనుమరుగైందని విమర్శించారు. ఆ జాబ్ క్యాలెండర్‌లో ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయలేదని ఫైర్ అయ్యారు. ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయకుండా 60వేల ఉద్యోగాలు భార్తీ చేశామని ప్రతీ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారనని మండిపడ్డారు. నోటిపికేషన్ విడుదల చేయకుండా ఏ విధంగా ఉద్యోగాలు భర్తీ చేశారని నిలదీశారు. ఎలాంటి లిటికేషన్ లేకుండా యూపీఎస్సీ తరహాల్లో నోటిఫికేషన్ విడుల చేయాలని డిమాండ్ చేశారు. ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. నోటిఫికేషన్ విడుల చేయని పక్షంలో స్థానిక సంస్థలో ఎన్నికల్లో పోటీ చేస్తామని, కాంగ్రెస్ పార్టీని బొంద పెడుతామని హెచ్చరించారు.

## శాస్త్రవేత్తల అపురూప సృష్టి.. మునగాకుతో ఆవుకు సూపర్ ఫుడ్.. కిలో రూ. 2 కే దాణా



మునగాకు మనుషులకు సంజీవని అని అంటారు. ఎందుకంటే 300 లకు పైగా వ్యాధులను నయం చేసే శక్తి ఈ మునగాకులో ఉందని పరిశోధనలలో తేలింది. అయితే ఇప్పుడు ఈ మునగాకుతో చేసే ఆహారం ఆవులకు కూడా సూపర్ అని చెబుతున్నారు శాస్త్రవేత్తలు. ఝాన్సీ గ్రాస్‌ల్యాండ్, ఫాడర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు మునగ ఆకులతో ఒక ఫార్ములాను తయారు చేశారు. దీనిని ఆవులకు తినిపించినప్పుడు అద్భుతమైన ఫలితం వచ్చింది. %ఉత్తరప్రదేశ్ లోని ఝాన్సీ గ్రాస్‌ల్యాండ్, ఫాడర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు పశువులను ఆరోగ్యంగా ఉంచి.. పాల ఉత్పత్తిని అద్భుతంగా పెంచే దేశీ ఫార్ములాను అభివృద్ధి చేశారు. ఈ ఫార్ములా ప్రత్యేకత ఏమిటంటే ఖరీదైన సప్లిమెంట్ ఆధారంగా తయారు చేసింది కాదు. భారతీయులు అద్భుతమైన ఔషధగుణాలు ఉన్న మొక్క మునగ అని భావిస్తారో దానిని నుంచి తయారు చేశారు. మునగాకు ఆకులను, కాండాలను కత్తిరించి ఎండబెట్టి.. ఆ పొడి నుంచి ఆవులకు ఆహారాన్ని తయారు చేసినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

మునగాకుతో చేసిన పొడిని పశువులు తినే ఆహారంలో చేర్చినప్పుడు ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. పాల ఉత్పత్తి 20 నుంచి 25 శాతం పెరిగింది. అలాగే ఆవుల శరీరంలో ప్రోటీన్, జింక్, ఫైబర్ పరిమాణంలో గణనీయమైన పెరుగుదల కనిపించిందని చెప్పారు. ఈ స్వదేశీ ఫార్ములా అతిపెద్ద లక్షణం దీని ధర. మన దేశంలో సాధారణంగా పశువుల దాణా కిలోకు 10 నుంచి 15 రూపాయలు ఖర్చవుతుంది. అయితే ఇప్పుడు ఈ మునగ ఆకుతో పశువులకు దాణా కిలోకు కేవలం 2 రూపాయల ఖర్చుతోనే తయారు చేయవచ్చు. ఇలా ఖర్చు తక్కువ కావడం వలన పాల ఉత్పత్తిదారులకు లాభదాయకంగా ఉండటమే కాదు.. ఆర్థికంగా కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మునగాకుని ఇప్పటివరకు ఆకు కూరలు లేదా ఔషధంగా మాత్రమే భావించేవారు. అయితే ఇక నుంచి ఇది పశుగ్రాసానికి సూపర్‌ఫుడ్‌గా మారింది. శాస్త్రవేత్తల ప్రకారం దీని ఆకులలో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి, అరటిపండ్ల కంటే ఎక్కువ పొటాషియం, పాలు, గుడ్ల కంటే ఎక్కువ మొత్తంలో ప్రోటీన్ ఉన్నాయి. ఈ మునగాకులో దాదాపు 21.53 శాతం ముడి ప్రోటీన్, 24.07 శాతం యాసిడ్ డిటర్జెంట్ ఫైబర్ మరియు 17.55 శాతం న్యూట్రల్ డిటర్జెంట్ ఫైబర్ ఉన్నాయి. దీనికి ఉన్న మరొక గొప్ప గుణం ఏమిటంటే.. ఈ మునగ చెట్టు కరువు పరిస్థితులలో కూడా సులభంగా పెరుగుతుంది. తక్కువ నీరు ఉన్న భూమిలో కూడా ఈ మొక్కను పెంచవచ్చు.

కోసిన వెంటనే ఆకులు పెరగడం మొదలు మునగ చెట్లను 50–50 లేదా 30–30 సెం.మీ దూరంలో నాటితే.. తక్కువ సమయంలోనే సమృద్ధిగా ఆకులు దిగుబడి వస్తుందని, ఎండిన తర్వాత ఆ ఆకులను ఆహారంగా మార్చవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. బుందేల్‌ఖండ్ ఆర్థిక వ్యవస్థలో పాల ఆధారిత మార్పు తీసుకురావడానికి ఈ ఆవిష్కరణను ఆచరణలో పెట్టమని ఇప్పుడు శాస్త్రవేత్తలు పశువుల పెంపకందారులను ప్రోత్సహిస్తున్నారు. ఝాన్సీ నుంచి ప్రారంభమైన ఈ ప్రయోగం ఇప్పుడు మొత్తం దేశానికి కొత్త ఆశాకిరణంగా ఉద్భవిస్తోంది.

## భారత్‌పై ట్రంప్ ట్యాక్స్‌తో అమెరికన్లకు నష్టం.. భారీగా పెరగనున్న ఐఫోన్ ధరలు..? ఎలా అంటే..?

భారత్‌పై 25 శాతం సుంకం విధించాలనే డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం సంచలనంగా మారింది. ప్రధానంగా ఆపిల్ ఐఫోన్ ఉత్పత్తులపై దీన్ని ప్రభావం భారీగా పడనుంది. ప్రస్తుతం ఆపిల్ ముందు ఒకటే మార్గం ఉంది. పన్నులను భరించడం లేదా ఐఫోన్ల ధరలను పెంచడం.

%డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25 శాతం పన్నులు విధించారు. దీంతో భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. ట్రంప్ నిర్ణయం భారత్‌ను అమెరికాకు ఐఫోన్ ఎగుమతి కేంద్రంగా మార్చాలనే ఆపిల్ ఆశయానికి గండి కొట్టొచ్చు. సింపుల్‌గా చెప్పాలంటే.. ఆపిల్ ఇప్పటివరకు దేశంలో తయారు చేసిన అన్ని ఐఫోన్ మోడళ్లపై అమెరికా 25 శాతం సుంకాన్ని విధిస్తుంది. డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో దేశంలో ఆపిల్ ఉత్పత్తుల తయారీ, ఎగుమతి ప్రణాళికలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

భారత్‌లో ఆపిల్‌కు 55 శాతం వాటా..

భారత ఎగుమతులపై 25 శాతం సుంకం.. దేశాన్ని అమెరికాకు ప్రధాన ఐఫోన్ ఎగుమతి కేంద్రంగా మార్చాలనే ఆపిల్ ప్రణాళికను ఖచ్చితంగా ప్రభావితం చేస్తుందని ఐడీసీ ఇండియా డివైస్ రీసెర్చ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ నవకేంద్ర సింగ్ అన్నారు. ఐడీసీ ప్రకారం.. ఆపిల్ యొక్క ఐఫోన్ షిప్‌మెంట్‌లలో అమెరికా 25 శాతం వాటాను కలిగి ఉంది. ఇది ఏడాదికి దాదాపు రూ. 6 కోట్లు. కానీ ఇప్పుడు ఎగుమతులు సుంకాల కారణంగా ఆపిల్ పెద్ద ఎదురుదెబ్బను ఎదుర్కోవచ్చు. ఇప్పటివరకు ఆపిల్ తన విస్తృత చైనా-ప్లస్-వన్ వ్యూహంలో భాగంగా దేశంలో ఫాక్స్‌కాన్ ద్వారా ఐఫోన్ ఉత్పత్తిని పెంచుతోంది. గత కొన్ని నెలల్లో అమెరికాకు వెళ్లిన ఐఫోన్‌లలో సగం భారతదేశంలో తయారు చేసినవే కావడం గమనార్హం. భారత్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో ఆపిల్ 55 శాతం వాటాను కలిగి ఉంది.

కౌంటర్ పాయింట్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ నీల్ షా ప్రకారం.. ఆపిల్ విధాన మార్పులపై నిఘా ఉంచుతూ షిప్‌మెంట్‌లను కొనసాగించవచ్చు. "టారిఫ్‌ల ప్రభావాన్ని ఆపిల్ స్వయంగా భరిస్తుంది లేదా టారిఫ్‌ల కారణంగా పెరిగిన ధరలను వినియోగదారుల నుంచి వసూల్ చేసే అవకాశం ఉంది. ఆపిల్ ఇప్పటికే పెరుగుతున్న కాంపోనెంట్ ఖర్చులతో ఇబ్బంది పడుతోంది. ముఖ్యంగా టీఎస్ఎంసీ కొత్త 3%అఎ% చిప్ ధరనే దీనికి ప్రధాన కారణం. కాబట్టి వారు ఖర్చులను తగ్గించుకోవాలి లేదా ధరలను పెంచాలని" నీల్ షా అభిప్రాయపడ్డారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఆపిల్ భారత్ నుంచి నుండి 5 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ఐఫోన్‌లను ఎగుమతి చేసింది. ఇది దేశం యొక్క మొత్తం స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో దాదాపు 70 శాతం వాటాను కలిగి ఉంది. గత సంవత్సరం ఇదే కాలంలో జరిగిన దాదాపు 3 బిలియన్ డాలర్ల ఎగుమతుల కంటే ఇది చాలా ఎక్కువ. ఆపిల్ సంస్థకు ఒకటే మార్గం.. అమెరికాలో ఫోన్ల ధరలను పెంచడం లేదా పన్నులను తగ్గించడం.

## రాబోయే 20 ఏళ్లకు సరిపడా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందించాలి - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సత్యమేవ జయతే – కొల్లాపూర్ కొల్లాపూర్ : హైడల్ పవర్‌తో పాటు పంప్డ స్టోరేజ్‌తో పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఆదివారం జెన్ కో, ట్రాన్స్ కో అధికారులతో కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరవై మూడు పాయింట్స్ ను గుర్తించి వాటి మీద సమగ్రమైన రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. జూరాల నుంచి పులిచింతల వరకు కృష్ణా మీద ఉన్న హైడల్ పవర్ ప్రాజెక్టులను సమీక్షించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అవసరం అయితే ప్రపంచ పేరుగాంచిన కన్సల్టెంట్ల సేవలను ఉపయోగించు కోవాలని ఆదేశించారు.

సోలార్ ద్వారా పగలు జరిగే ఉత్పత్తిని స్టోరేజ్ చేసి రాత్రివేళ ఉపయోగానికి అవసరమైన సాంకేతికతను, దానికి అవసరమైన స్టోరేజ్ వ్యవస్థను రూపొందించి కోవాలన్నారు. రాబోయే తరాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యావరణ హితమైన పవర్ ను ఉత్పత్తి చేసి అందించాలన్నారు.

రాష్ట్రంలో ఏటేటా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని రాబోయే ఇరవై ఏళ్లకు సరిపడా విద్యుత్తు ఉత్పత్తిని అందుకోవడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కోరారు. గ్రీన్ హైడ్రోజన్ , ఫ్లోటింగ్ సోలార్, రూఫ్ సోలార్ థర్మల్ పవర్ , పవన విద్యుత్తు, అణువిద్యుత్తు బ్యాటరీ స్టోరేజ్ లాం

## భార్యతో కలిసి సైకిల్‌పై ఆస్పత్రి పర్యటనకు వెళ్లిన కలెక్టర్



సత్యమేవ జయతే – రామాయంపేట రామాయంపేట : జిల్లా వ్యాప్తంగా విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి వహించి ప్రజలకు సేవచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఆదివారం తన సతీమణితో మెదక్ జిల్లా కేంద్రం నుండి 20 కిలోమీటర్ల మేర సైకిల్‌పై రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు చేరుకుని అక్కడి పరిస్థితులపై రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను, రోగులకు అందించే మందులను తనిఖీ చేశారు.

– అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ..

వర్షాకాలం దృష్ట్యా ప్రజలు తమ వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ కేసులు అసలే లేవన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ఆకస్మిక తనిఖీల ఉద్దేశ్యమన్నారు. పేద ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని తెలిపారు. రికార్డులను తనిఖీ చేసిన కలెక్టర్ వైద్యులు ఎక్కువ శాతం నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. డెలివరీలు ప్రభుత్వ దవాఖానాలోనే అయ్యేట్లు సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని పెట్టిందన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉందన్నారు. సెలవు రోజుల్లో కూడా వైద్యధికారులు పనిచేస్తున్నారని అన్నారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి ప్రతిరోజు ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజలు సైతం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు మనదరికి చేరవన్నారు. తమ ఇంటి ఆవరణలో చెత్తా చెదారం లేకుండా ఉండడమే గాకుండా దోమలు వృద్ధి చెందకుండా కుళాయిలలో నీటినిల్వలు ఉండకుండా చూసుకున్నైటెతే ప్రజలందరు సురక్షితంగా ఉంటారన్నారు. దవాఖానాలో వైద్య సిబ్బందిని త్వరలోనే సమకూరుస్తామని అన్నారు. తొందర్లోనే గైనకాలజిస్టు పోస్టును భర్తీ చేస్తామన్నారు. దవాఖానాలో అన్ని రకాల మౌళిక సదుపాయాలను కల్పించడమే గాకుండా నిష్ణాతులైన వైద్య సిబ్బందినే నియమిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట దవాఖాన వైద్య సిబ్బంది ఉన్నారు.

## పెద్దకోడూరు పాలిటెక్నిక్ కాలేజీలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం




హైదరాబాద్ : చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో 16 గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జి. స్నేహలత తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఏఐసీటీఈ గుర్తింపు పొందిన విద్యాసంస్థలో ఆయా రకాల పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అర్హతలు ఉన్న అభ్యర్థులు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను కాలేజీ కార్యాలయంలో పొందాలన్నారు. కళాశాలలో ఖాళీల వివరాలు ఈ విధంగా ఉన్నట్లు తెలిపారు. మొత్తం 16 పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీగా భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

కెమిస్ట్రీ 01, ఫిజిక్స్ 01, మ్యాథ్స్ 01, ఇంగ్లీష్ 01, ఈఈఈ 03, సివిల్ 04, కంప్యూటర్ ఇంజనీరింగ్ (సిఎంఈ) 05 ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో ఫస్ట్ క్లాస్ ఎంఈ/ ఎం.టెక్, బీఈ/ బీటెక్/ ఎం. పి హెచ్ఐఎల్/ పీహెచ్. డి ఎంఎస్సీ అర్హతలు కలిగిన నిరుద్యోగులు విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఉండాలన్నారు. దరఖాస్తులను ఆగస్టు 01 నుంచి ఆగస్టు 05 వరకు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 05న దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు, ఆగస్టు 07న గెస్ట్ లెక్చరర్లకు ఆదేశాల జారీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ముందస్తుగా తమ సర్టిఫికెట్ల ప్రతులతో పాటు పూర్తి వివరాలతో కలిగిన దరఖాస్తును నిర్ణీత తేదీలలో కళాశాలలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8096907520 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపల్ స్నేహలత కోరారు.

## గ్రామీణ వికాసం బిజెపి తోనే సాధ్యం

### మహాసంపర్క్ అభియాన్ లో భాగంగా సుజాతనగర్ మండలం

### రాఘవాపురం గ్రామంలో ప్రచారం





గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యమని తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వమే నిధులు విడుదల చేస్తుందని ఆ పార్టీ శ్రేణులు ఆదివారం రాఘవపురంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపికి మద్దతు ఇవ్వాలని ఇంటింటికి తిరుగుతూ బిజెపి పార్టీ ముద్రించిన కరపత్రాలను, పంపిణీ చేశారు. అలాగే బిజెపి గుర్తులు కలిగిన స్టిక్కర్లు షాపుల వద్ద పలు కూడళ్లలో అంటించారు. భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాలలో ఏ విధంగా వస్తున్నాయో వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ఎంపీటీసీ జెడ్పిటిసి అభ్యర్థులను గెలిపించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాఘవపురం బూత్ అధ్యక్షుడు మొగిలి సతీష్, సుజాతనగర్ మండల నాయకులు కొల్లి నరేందర్ బాబు, పెద్దమల్ల నాగేశ్వరరావు, కూరపాటి రామారావు, గొడుగు శ్రీధర్ యాదవ్, కొత్తగూడెం పట్టణ ప్రధాన కార్యదర్శి గుంపుల మహేష్, కృష్ణారెడ్డి గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల ప్రభుత్వ సహాయం సరిపోవడంలేదని లబ్ధిదారుల ఆందోళన



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రూ 5 లక్షల రూపాయలు సరిపోవడంలేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు, నిర్మాణ ఖర్చులు పెరుగుతుండడంతో లబ్ధిదారులపై అధిక భారం పడుతుంది. ఇంతకు మునుపు సిమెంటు ,ఇసుక, ధరలు ఇందిరమ్మ ఇళ్ల పథకం వచ్చిన తరువాత విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా ఇసుక రవాణా అక్రమంగా జరగడం వలన ట్రాక్టర్ ఇసుక రూ 6 వేలో చొప్పున చెల్లించవలసి వస్తుందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు,

మేస్త్రి, కూలీల ,కూలీలు గణనీయంగా పెరగడంతో, ఈ రోజుల్లో ఒక ఇంటి నిర్మాణాన్ని చేపట్టాలంటే వీరికే ఎక్కువ ఖర్చు అవుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇనుప సువ్వ, ఇటుకలు, కరెంటు వైరింగ్ సామాగ్రి, దర్వాజా తలుపులు, కిటికీలు వంటి ధరలు కూడా పెరగడంతో, ప్రభుత్వం ఇచ్చే రూ 5 లక్షల రూపాయలు ఏ మాత్రం సరిపోవటం లేదని, ఇట్టి రూపాయలు పునాది, గోడలు వరకే సరిపోతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. మిగిలిన నిర్మాణం కొరకు అప్పులు చేయవలసి వస్తుందని, ఇది నిరుపేదలకు మరో పెద్ద సమస్యగా భారంగా మారుతుందని విశ్లేషకులు అంటున్నారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు రూ 10 లక్షల వరకు పెంచాలని ప్రజలు కోరుకుంటున్నాను. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన మహిళలకు, మహిళా సంఘాల ద్వారా మరో రూ 5 లక్షల రూపాయల రుణం వాయిదాల రూపంలో అందిస్తే బాగుంటుందని విశ్లేషకులు అంటున్నారు. ఇది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఈ రుణాలు సులభ వాయిదాలలో చెల్లించే వెసులుబాటు వలన వారిపై అధిక భారం పడకుండా చేయవచ్చు అని, ఇట్టి రెండు డిమాండ్ల విషయంలో ప్రభుత్వం లోతుగా విశ్లేషించి, అధిక ఆర్థిక భారం పేద ప్రజలపై పడకుండా చేయూతనివ్వాలని కొందరు మేధావి వర్గాలు సూచిస్తున్నాయి.

# ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ను విమర్శించే అర్హత సేవాలాల్ సేనకు లేదు -తుడుం దెబ్బ.

ఇల్లందు మండలం, సుభాష్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో గల కొమరం భీమ్ కాలనీలో ఈరోజు తుడుం దెబ్బ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగ్గెల రామస్వామి, లీగల్ అడ్వైజర్ (లాయర్ )అరెం పాపారావు, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి జార కృష్ణ మాట్లాడుతూ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాబురావు సుప్రీంకోర్టులో లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని సుప్రీం కోర్టులో కేసు వేయడం జరిగింది. దీనికి సేవలాల్ సేన రాష్ట్ర జిల్లా అధ్యక్షులు ఇట్టి విషయాన్ని జీర్ణించుకోలేక పాల్వంచలో వ్యతిరేక ప్రెస్ మీట్ పెట్టి విచక్షణ కోల్పోయి బాధ్యత రహితంగా మాట్లాడం జరిగింది. దీనిని పూర్తిగా తుడుం దెబ్బ ఖండిస్తుంది అని అన్నారు. అనవసరంగా సమస్యలను ప్రోత్సహిస్తే దానికి తుడుం దెబ్బ గట్టిగా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రొఫెసర్ సీతారాం నాయక్, సంజీవ్ నాయక్ కొంతమంది లంబాడీలు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్,సోయంబాబు రావును బెదిరిస్తూ పిటిషన్ వెనక్కి తీసుకోవాలని అలాగే కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని రాజకీయ పార్టీలకు ప్రభుత్వాలకు అంటకట్టేసి రాజకీయం చేయడం పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. 2018లో సీతారాం నాయక్ ఎంపీగా ఉన్న టైంలో నే ఆదివాసీలు సుప్రీంకోర్టు ను ఆశ్రయించి లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని కేసు వేయడం జరిగిందని గుర్తు చేశారు. 1976 సంవత్సరంలో లంబాడీలమైన మమ్మలను ఎస్టీలుగా కలపడం



జరిగిందని చెప్పుకుస్తున్నారుకదా. ఎలా ఏ చట్టం ఏ కమిషన్ రిపోర్ట్ ద్వారా మిమ్మల్ని ఎస్టీలుగా కలపమని ఇచ్చారంటూ ప్రశ్నించారు. 1956 సెప్టెంబర్ పదో తారీఖున ఓ చట్టం రాగా 1956 అక్టోబర్ రెండో చట్టం వచ్చింది ఈ రెండు చట్టాలలో ఎవర్ని కల్పమని గాని తీసివేయమని గాని ఎలాంటిది లేదు అన్నారు. 1965 సంవత్సరంలో లోకార్ కమిషన్ కూడా రీజినల్ షెడ్యూల్ రీజినల్ క్యాస్ట్ షెడ్యూల్ ట్రైబల్ లిస్టులో కూడా బంజారాలను తీసివేయాలని ఎస్టిలో కలపారాదని రికమండ్ చేసిందన్నారు. స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ లో కూడా వారికి క్యాస్ట్, ఏజెన్సీ సర్టిఫికెట్ ఇవ్వడం నిలిపివేయాలని లేని పక్షంలో వారిపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధార్ సొసైటీ కోశాధికారి మెట్ల పాపయ్య, ఉండం రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలి.

### విచక్షణలేని ఉత్పత్తి లక్ష్యాలు,

### అసురక్షిత మైనింగ్ తక్షణమే నిలిపేయాలి .

### సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ డిమాండ్.

కోయగూడెం ఓసిపి, ఇల్లందు ఏరియా,ఈ రోజు ఇల్లందు ఏరియాలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం (ఎ .బి.కె.ఎం.ఎస్%-% బి ఎం ఎస్ అనుబంధం) ఆధ్వర్యంలో ఒక ముఖ్య ద్వారా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఏరియా కార్యదర్శి పి. లీలకృష్ణ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా పి. మాధవ నాయక్ (ఎ బి కె ఎం ఎస్ కార్యదర్శి మరియు జే బి సి సి ఐ సభ్యులు), శ్రీ టీఎస్ పవన్ కుమార్ (చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు స్టాండర్డైజేషన్ కమిటీ సభ్యులు) పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీ పి. మాధవ నాయక్ మాట్లాడుతూ:భద్రతా నిబంధనలు (మైన్స్ యాక్ట్ 1952, సి ఎం ఆర్ 2017, ఎం ఎం ఆర్ 1961) ఉల్లంఘించడాన్ని తక్షణమే నిలిపివేయాలి. కార్మికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే అసురక్షిత మైనింగ్ విధానాలు, పర్యావరణానికి హానికరమైన విచక్షణలేని ఉత్పత్తి లక్ష్యాలను వెంటనే ఆపాలి. డీజీఎంఎస్ (డి జి ఎం ఎస్) జారీ చేసిన మార్గదర్శకాలను 100% పాటించడం యాజమాన్యం యొక్క బాధ్యత."అలాగే ఆయన పేర్కొన్నారు:గుర్తింపు కార్మిక సంఘం ప్రాథమిక భద్రతా సమావేశాలు నిర్వహించడంలో పూర్తిగా విఫలమైంది.




భద్రతాపరమైన అంశాలపై జే .బి.సి.సి.ఐ లోని అన్ని సంఘాలు సమర్థవంతంగా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నదే మా నిబద్ధత. సేఫ్టీ సమావేశాలు నియమితంగా నిర్వహించినప్పుడే కార్మికుల ప్రాణాలకు రక్షణ లభిస్తుంది.""భద్రతను తాకట్టు పెట్టే ఉత్పత్తి లక్ష్యాలపై మేము రాజీలేని పోరాటం కొనసాగిస్తాము. కార్మికుల ప్రాణాలకన్నా ముఖ్యమైనది మరొకటి లేదు. ప్రతి కార్మికుడికి చట్టబద్ధమైన, సురక్షితమైన పని వాతావరణం కల్పించాల్సిందే." ఇంకా, గుర్తింపు కార్మిక సంఘాలు తమ ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని అన్నారు. ముఖ్యంగా:

సొంతింటి పథకం

పెరిక్స్ పై ఆదాయపు పన్ను రీయింబర్స్‌మెంట్

రాష్ట్ర ప్రభుత్వానికి చెందవలసిన రూ. 39,661 కోట్ల బకాయిల వసూలువిషయాల్లో కనీస స్పందన లేకపోవడం వల్ల కార్మికులకు తీవ్ర న్యాయబద్ధతల వైఫల్యం ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఘనంగా ఫ్రెండ్షిప్ డే వేడుకలు

### కేక్ కటింగ్ తో సందడి చేసిన వ్యాపారవేత్తలు

### ఇల్లందులో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో

### స్నేహితుల దినోత్సవ వేడుకలు

ఈ సృష్టిలో రక్తసంబంధం లేకుండా మన కోసం ఆలోచించే బంధం ఏదైనా ఉంది అంటే అది స్నేహితుడు మాత్రమే అని చెప్పవచ్చు. అలాంటి స్నేహితుల దినోత్సవాన్ని వ్యాపారవేత్తలందరూ ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులోని మార్కెట్ సెంటర్ వద్ద ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఫ్రెండ్షిప్ డే వేడుకలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా కేక్ కటింగ్ నిర్వహించడంతో కార్యక్రమం మరింత అందంగా మారింది. ఈ సందర్భంగా మహాసభ మండల, పట్టణ అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ స్నేహం ఒక విశిష్టమైన బంధం దీనికి ధనిక, పేద అనే తేడా ఉండదు అన్నారు. కుల, మత భేదాలను పట్టించుకోదన్నారు. బంధుత్వాన్ని మించినది స్నేహిత బంధం అని పేర్కొన్నారు. అలాగే ఒకరినొకరు కరచలనం చేసుకుంటూ ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్రెండ్షిప్ బ్యాండ్స్ కట్టుకున్నారు.

అనంతరం ఇల్లందు పోలీస్ స్టేషన్లో నూతనంగా ఎస్‌హెచ్‌ఓ గా బాధ్యతలు స్వీకరించిన తాటిపాముల సురేష్ కుమార్ గౌడ్‌ను ఆర్యవైశ్య మహాసభ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో




సన్మానించారు. అలాగే పూల మొక్కను బహుమతిగా అందించి ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నాగేశ్ కుమార్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్, కండె రమేష్, నరేంద్రుల అను, సైఫా రాజశేఖర్, తాటిపల్లి సుబ్బారావు, యెలుగూరి మధుబాబు, గందె సురేష్, కొప్పురావూరి భాస్కర్ రావు, చందా భద్రం, రాచర్ల వెంకటేశ్వర్లు, తేలుకుంట్ల రజినీకాంత్, గౌరిశెట్టి నగేష్, ఆకుల సతీష్, ఓరుగంటి పవన్, భోనగిరి రవి కిరణ్, నాగరాజు,యెలుగూరి సతీష్ కుమార్,సైఫా శ్రీనివాస్, తాటిపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# భూముల మీద బిజినెస్... మేనిఫెస్టో ముసుగులో మోసం !"బిఎస్పి

ప్రజాస్వామ్యంలో మేనిఫెస్టో పేరుతో మోసంఎన్నికల ముందు ప్రతి పార్టీ ప్రజలకు మేధోమత్తంలో మేనిఫెస్టో హామీలు ఇస్తుంది ఉచిత విద్య, ఆరోగ్యం, న్యాయంగా ఉద్యోగాలు, డబుల్ బెడ్ రూములు, రైతులకు రుణ మాఫీ, యువతకు ఉద్యోగాలు... అని ప్రతిజ్ఞలు చేస్తూ ఓట్ల కోసం నాటకీయంగా నటిస్తారు.అయితే, ఓటమి సమయంలో ఆ హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వ భూములు అమ్మేస్తారు. అంటే ప్రజల సహజ వనరులను అమ్మేసి, మళ్లీ అదే డబ్బుతో ప్రజల దృష్టిని మాయ చేస్తారు. ఇది దారుణమైన మోసం. ఇది పబ్లిక్ ప్లస్ ప్లెజర్ ప్లస్ ప్రాపర్టీని ప్రైవేట్ లాభాల కోసమే తాకట్టు పెట్టడమే.ప్రభుత్వ భూములు %-% ఎవరి కోసం?నిరుపేదలకు భూములు ఇవ్వాలంటే "లేవు" అని ప్రభుత్వాలు చెబుతాయి.అదే కార్పొరేట్ సంస్థలకు, ఎగుమతి కంపెనీలకు, ఫార్మా మాఫియాలకు మాత్రం రూపాయి లేదా 50 పైసలకే వేల ఎకరాల భూములు ఇస్తారు.ఇది సామాన్యులపై ఓపెన్ లూటీ.ఎన్నికల మేనిఫెస్టో అమలు కోసం ప్రభుత్వ భూములను అమ్మడం ,దొంగతనం మీద శంఖారావం చేయడమే.ఉదాహరణ:ఆంధ్రప్రదేశ్‌లో భూముల విక్రయాల పేరుతో అమరావతి భూ కుంభకోణం.తెలంగాణలో %ఎవీణూ% భూములు వేలం వేస్తూ రెవెన్యూ గ్యాప్ తగ్గించుకుంటున్నారు.మహారాష్ట్రలో %వీవీ=ణూ% భూములు కార్పొరేట్ భూతాలకు లీజుగా వదిలేస్తున్నారుఇది కేవలం వ్యాపారాలకే కాదు... కరప్షన్‌కు కార్నివల్.

%ూజ/ూ/దీజ/వీఅఅశీతీఃఅవం% అగ్రవర్ణ పేదలకు ఉద్యోగాలు ఎక్కడ?భూముల అమ్మకాల పేరుతో ఏర్పడే పారిశ్రామిక సంస్థలు, స్పెషల్ జోన్‌లు, ప్రాజెక్టుల్లో...ఏ గ్రూప్ కేటగిరీ వారికి ఎంత ఉద్యోగం ఇచ్చారు?ఉద్యోగాల రిజర్వేషన్లు పాటించారా?రాష్ట్ర వారీగా డేటా ఏమిటి?1కి భూమి ఇస్తూ రూ. 1 కోట్ల విలువ చేసే కంపెనీలకు భారం ఎందుకు?అదే డబ్బుతో ఉద్యోగాలు ఇవ్వకపోతే ప్రజలకు నష్టం కాదా?భూములపై RTI - ప్రజల హక్కు కదా?సమాచార హక్కు చట్టం ప్రకారం, ప్రజలు ఈ ప్రశ్నలు అడగాలి:కొనుగోలు చేసిన సంస్థ ఎవరు?ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు?ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంత శాతం ఇచ్చారు?%=×%కి సమాధానం ఇవ్వకుండా ప్రభుత్వాలు తప్పించుకుంటే...అది రాజ్యాంగ విరుద్ధం!రాష్ట్రపతి, సుప్రీం కోర్టు జోక్యం అవసరం ఎందుకంటే...ఇది కేవలం అభివృద్ధి పేరుతో భూముల అమ్మకము కాదు.ఇది సామాజిక న్యాయం మీద దాడి. ప్రజల వనరులపై ఆక్రమణ.రాష్ట్రపతికి హక్కు ఉంది %-% రాష్ట్రాల పాలనపై సూచనలు ఇవ్వడానికి.సుప్రీం కోర్టు %-% ప్రజల హక్కులను కాపాడే ముద్దుల తల్లిదండ్రులమంటూ చెప్పుకునే సంస్థ.కాబట్టి ఇలాంటి అమ్మకాలు, లీజులు, మేనిఫెస్టో మోసాలపై జాతీయ స్థాయిలో విచారణ రావాలి."మీరు ప్రభుత్వ భూములను అమ్మి మేనిఫెస్టో నెరవేర్చినట్టు నటించకండి...ప్రజల డబ్బుతో ప్రజలే మోసపోతే %-% ప్రజాస్వామ్యం మిగులదు!"ప్రజల డిమాండ్:ప్రభుత్వ భూముల అమ్మకాలపై పబ్లిక్ జుడీషియల్ ఎంక్వైరీ పెట్టాలిపారిశ్రామిక వేత్తలకు ఇచ్చిన భూములపై రిజర్వేషన్ల అమలును ప్రజలతో షేర్ చేయాలిమేనిఫెస్టో అమలు ఖర్చు వివరాలను ప్రతి సంవత్సరం ప్రజలకు హక్కుగా ఇవ్వాలి సమాన హక్కుల బాటలో ప్రభుత్వ బాధ్యతను ప్రశ్నిద్దాం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రవర్ణ పేదల హక్కులకు సమరసింహాలం!

సత్యమేవ జయతే

సోమవారం 04 ఆగస్టు 2025

# ఆదివాసీ గ్రామాలలోని పేదలకు కొమరారం పోలీసుల ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు శంబునిగూడెం,శెట్టిపల్లి గ్రామాలలోని 100 పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను రాబిన్ హుడ్ అనే స్వచ్ఛంద సంస్థ సహాయంతో కొమరారం పోలీసులు అందిచడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఇల్లందు డిఎస్పీ చంద్రభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలను సందర్శినప్పుడు కొంతమంది పేదవాళ్ళు కనీస కుటుంబ అవసరాలకు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని వారి వివరాలు సేకరించి స్వచ్ఛంద సంస్థల సహాయంతో బియ్యం, కందిపప్పు,గోధుమ పిండి వారికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఆదివాసి ప్రజలు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరినారు. యువత గంజాయి,మద్యపానం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపినారు. కొంతమంది ప్రజలు వాహనాల డ్రైవింగ్ పై అవగాహన లేకుండా అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ మద్యం తాగి డ్రైవ్ చేయడం వలన రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్నారు. కావున వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తెలిపినారు. ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గతంలో కూడా మెడికల్ క్యాంపులు,దోమతెరలు పంపిణీ,దుప్పట్లు,సోలార్ లైట్లు,నిత్యవసర సరుకులు,యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా శంభుని గూడెం,శెట్టిపల్లి గ్రామ ప్రజలు పోలీస్ శాఖకు మరియు రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థకు ధన్యవాదాలు తెలిపినారు. ఇట్టి కార్యక్రమంలో గుండాల సీఐ రవీందర్,కొమరారం ఎస్సై నాగుల్ మీరా మరియు గుండాల ఎస్సై సైదా రవూఫ్,పోలీస్ సిబ్బంది మరియు రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.






## బంజారా సోదర సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు

### కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి తీజ్ వేడుకల్లో పాల్గొని సాంప్రదాయం నృత్యం చేసిన సీతక్క

కొత్తగూడెం టౌన్ చిట్టి రామవరం తండాలో ఆదివారం తీజ్ పండుగ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి హాజరై బంజారా సోదర సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం సంత్
శ్రీ సేవాలాల్ మహారాజ్, మేరమా భవానీలకు ప్రత్యేక పూజలు చేశారు. తీజ్ బుట్టను ఎత్తుకొని కన్నెపిల్లలతో బంజారా సాంప్రదాయ నృత్యం చేశారు. తొమ్మిది రోజులపాటు పెళ్లికాని ఆడపిల్లలు ఎంతో నియమనిష్టలతో చేసే తీజ్ పండుగ గొప్పదని చెప్పారు. గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించి ఆచరించడం మనందరి బాధ్యతా అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తీజ్ పండుగ జరుపుకుంటున్న బంజారాలకు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం 19వ డివిజన్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పూర్ణచంద్ర నాయక్ స్వగృహంలో తైవాన్ మామిడి మొక్క నాటారు. స్థానిక ప్రజలతో మమేకమై ఆప్యాయంగా పలకరించి వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బానోత్





సాంగు, బానోత్ చందర్, భీమా, చిట్టిబాబు, వాసు, బాలు, రూప్ల, రాందాస్, రమేష్, శ్యామ్, ఖాజా భక్ష్, నాగరాజు, అమన్, సిద్దు, సోహెల్, మున్ను, బన్ను, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## చీపురుగూడెం గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల నిర్వహణపై తీవ్రంగా ఆగ్రహించిన ఎమ్మెల్యే జారె

### హెచ్ఎమ్ తో పాటు హాస్టల్ వార్డెన్ ను తక్షణమే విధుల నుంచి తొలగింపు వారిపై చర్యలకు ఉన్నతాధికారులకు ఆదేశం

అశ్వరావుపేటనియోజకవర్గందమ్మపేట మండలం చీపురుగూడెం గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆకస్మికంగా తనిఖీ చేసి హాస్టల్ నిర్వాహణపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు ప్రధాన ఉపాధ్యాయులుతో పాటు హాస్టల్ వార్డెన్ ను తక్షణమే విధుల నుంచి తొలగించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా విద్యార్థుల రిజిస్టర్ లో అవకతవకలను గుర్తించి పద్ధతి మార్చుకోవాలని ఇదే చివరి అవకాశమని హెచ్చరించారు అలాగే మెనూ ప్రకారం భోజనం అందించాలని నాసిరకం కూరగాయలు సరుకులు వాడితే తమరిపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు నాసిరకం కూరగాయలు అందించే కాంట్రాక్ట్ రద్దు చేసి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని అధికారులకు తెలిపారు హాస్టల్ నిర్వహణ సరిగ్గా లేదని నేను మళ్ళీ వచ్చేసరికి అన్ని విషయాలు మెరుగుపరచాలన్నారు ప్రభుత్వ లక్ష్యాలను నీరుగార్చవద్దని హెచ్చరించారు.





## కాంగ్రెస్ ప్రభుత్వం పై మాజీ ఎమ్మెల్యే మెచ్చా ఫైర్ :



అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం చీపురుగూడెం ఆశ్రమ హాస్టల్లో విద్యార్థులకు సరిగా భోజనం లేదనే వార్తపై మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యార్థులకు కనీసం అన్నం కూడా పెట్టడం చేతకావడం లేదంటూ మండిపడ్డారు. పాలన చేతకాకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో అన్ని హాస్టళ్లను సందర్శిస్తానని తెలిపారు.

## పెబ్బేర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కు ఘనంగా సన్మానం




గురువందనం కార్యక్రమం లో భాగంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కు సన్మానం ఈరోజు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రం లోని కె డి ఆర్ శిశు మందిర్ లో గురువందనం కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో అత్యుత్తమ సేవలం దించిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. అందులో భాగంగా పెబ్బేరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పింటి నరేశ్ కుమార్ ను ఎం ఎల్ సి శ్రీ ఏ వి ఎన్ రెడ్డి గారు ఘనంగా సన్మానించారు... ఈ సందర్భంగా ఏ వి ఎన్ రెడ్డి గారు మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు

## అమ్మ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ప్రారంభం.



.బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుడు మిత్రుడు భూక్యా. సురేష్ ఈరోజు ముకుందాపురం సెంటర్లో అమ్మఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఏర్పాటు చేసిన దానిని దిండిగాల రాజేందర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రారంభించారు. వారితో పాటు ఎస్.రంగనాథ్, (టి బి జి కె ఎస్ ) డిప్యూటీ జనరల్ సెక్రటరీ, బావుసింగ్ నాయక్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్, అబ్దుల్ నబీ, పట్టణ ఉపాధ్యక్షుడు,ఘాజీ బాబా, మాజీ కోఆప్షన్ మెంబర్,రేణుక, మండల కార్యదర్శి, జబ్బార్, వసంతరావు, సనా రాజేష్ ఉపేందర్, ఇమ్రాన్, పరికపెల్లి రవి, సాయి, శివ మునిగంటి, హరికృష్ణ సత్తాల, రవికాంత్, హరిప్రసాద్ యాదవ్, ముకుందాపురం గ్రామస్థులు శోభన్, బండారి వెంకన్న, ఐలు నారాయణ డాక్టర్ పాషా మహేందర్ రెడ్డి మంగీలాల్ ముజుభాయ్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## గోలియా తండా ఆది పరాశక్తి అమ్మవారు బోనాలు



.ముల్లోకాలను ఏలే ఆదిపరాశక్తి దీవెనలు నియోజకవర్గ ప్రజలకు మెండుగా ఉండాలని, టేకులపల్లి లో, గోలియా తండ ఆదిపరాశక్తి అమ్మవారి బోనాల పండుగ వేళ, అక్క చెల్లెమ్మల బోనాలతో మొక్కులు చెల్లింపులు పాలుపంచుకునే సంతోషాల నడుమ ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య. ఈ కార్యక్రమంలో కనకయ్య అభిమానులు ఊరి ప్రజలు పాలుపంచుకున్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ సంబరాలు.




స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లైన్స్ క్లబ్ పెద్ద వంగర అధ్యక్షుడు తంగళ్ళపల్లి మల్లికార్జున చారి పెద్ద వంగర ఎక్స్ రోడ్ వద్ద సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్ ఫ్రెండ్షిప్ డే సెలబ్రేషన్స్ ను ఏర్పాటుచేసి లయన్స్ క్లబ్ సభ్యుల మరియు పాత్రికేయుల మధ్యలో కేక్ కట్ చేసి అందరికీ స్నేహపూర్వకంగా చేతులకు రాకెట్ల వలె కంకణాలను కట్టి ఒకరికి ఒకరు కేకులు తినిపించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున చారి మాట్లాడుతూ మనిషి జీవితంలో కష్టం వచ్చినా సంతోషం వచ్చినా స్వార్థం లేకుండా నిస్వార్థంగా పాలుపంచుకునే వ్యక్తి స్నేహితుడు. స్నేహితులని చివరి వరకు స్నేహం చేసిన జీవితం స్వార్థకత ఉంటుందని ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని వడిదొడుకులు వచ్చినా స్నేహాన్ని మరువకూడదని అందుకు శ్రీకృష్ణుడు కుచేలుడు స్నేహం మనకెంతో ఉదాహరణ అని తెలిపారు. లైన్స్ క్లబ్ సభ్యులు కూడా ఐక్యమత్యం తోటి స్నేహం అనే పేరుతో సేవా కార్యక్రమాలతో ఒకరి కష్టంలో పాలుపంచుకోవడం, అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చార్టెడ్ ప్రెసిడెంట్ ఏదునూరి శ్రీనివాస్,లయన్స్ కోశాధికారి ఎడవల్లి మధుసూదన్ రెడ్డి,సెక్రటరీ రాపోలు శ్రీనివాస్, ముత్తినేని శ్రీనివాస్,అనపురం రవి, జలగం సతీష్,గూడ వెంకటేశ్వర్లు,పాత్రికేయులు రాయారపు రాజు,రామ్మూర్తి, బాలాజీ,తదితరులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే





నర్సింహులపేట మండలం వంతడపల గ్రామానికి చెందిన నర్సింహులపేట %దీ=ూ% మండల ప్రధాన కార్యదర్శి కుంభం సువీర్ రెడ్డి తండ్రి సంవత్సరీక కార్యక్రమానికి హాజరై కీ"శేలికుంభం దామోదర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ డి ఎస్ రెడ్యా నాయక్ యల్లు మధుసూదన్ రెడ్డి నెలకుర్తి సత్తిరెడ్డి దామ వెంకటేశ్వరరావు మరిపెడ మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు అయూబ్ పాషాకట్ల పాపారావు సోషల్ మీడియా మారపంగు వీరన్న

## దోస్త్ మేర దోస్త్ అంటూ అండగా నిలిచిన స్నేహితులు



స్నేహితుల దినోత్సవం రోజున స్నేహం అనే పదానికి నిలువటద్ధం గా నిలిచిన ఘటన ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారంలో చోటు చేసుకుంది వివరాల్లోకి వెళ్తే చిన్ననాగారం గ్రామానికి చెందిన పోలోజు వ్యాకరణ చారి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశాడు. ఆయన కుటుంబానికి బాల్యమిత్రులు 1980-81 ఇనుగుర్తి హై స్కూల్ 10 వ,తరగతి క్లాస్ మెంట్స్ రూ.25,000 ఆర్థిక సహాయం అందచేసి వ్యాకర్ణ చారి కుటుంబా నికి అండగా ఉంటామని,ధైర్యం చెప్పి చారి చిత్ర పటానికి పూలమాల వేసి,కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వద్దిరాజు దేవేందర్. పరిపాటి మహెబూబ్ రెడ్డి,చిర్రగోని చంద్రమోహన్, రిటైర్డ్ పిఇటి కందునూరి వెంకటేశ్వర్లు,రవీంద్ర చారి,వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్ కు చెందుతుంది.



ఇనుగుర్తి మండలం మీట్యా తండా గ్రామపంచాయతీ పరిధిలోని తండాకు సీసీ రోడ్డును బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన నిధుల నుండి రూపాయలు 10 లక్షలు సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయగా ఆదివారం ఆ పనులను ఎంపీ రవిచంద్ర సోదరుడు వద్దిరాజు దేవేందర్, పిఎసిఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, మీట్యా తండా మాజీ సర్పంచ్ బానోతు నరేష్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. తండాకు సిసి రోడ్లు మంజూరు చేసిన ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు తండావాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి, తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత కేసిఆర్ కు చెందుతుంది అని ,కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావటం పక్క అని తండా వాసులు ముక్తా కంఠంతో చెపుతున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బానోతు రవి నాయక్, ఉపసర్పంచ్ భూక్య రాములు, మాజీ తోరూర్ వ్యవసాయం మార్కెట్ డైరెక్టర్ గుగులోతు రవి, నాయకులు బానోతు రమేష్ భూక్య వెంకన్న గుగులోతు శ్రీను గుగులోతు రాజేందర్ భూక్య ప్రభాకర్ భూక్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో జరిగే నూతన వైన్స్ లాటరీ పద్ధతిని అడ్డుకుంటాం సేవాలాల్ యువసేన



పాల్వంచ మండలంలోని పట్టణంలో మద్యం సిండికేట్లు ఏర్పాటు చేసి, పాల్వంచ పరిసర గ్రామాలకు పెద్ద ఎత్తున మద్యం సరఫరా చేస్తున్నారని, బెల్ట్ షాపులు నిర్వీర్యంగా నడుస్తుండటం వల్ల ప్రజల ఆరోగ్యానికి భంగం కలుగుతోందని, కుటుంబాల్లో కలహాలు తలెత్తుతున్నాయని సేవాలాల్ యువసేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంగోత్ సురేష్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.పాల్వంచ పట్టణంలో ఉన్న బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయాలని, మద్యం సిండికేట్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే మద్యం కొత్త లాటరీ పాలసీకి సేవాలాల్ యువసేన అడ్డుకుంటుందని తీవ్రంగా హెచ్చరించారు.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, బెల్ట్ షాపులకు సంబంధించిన దారుణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన పాల్వంచ మండల అధ్యక్షులు జరపల పరమేష్, గుగులోత్ రాకేష్, అరుణ్ పాల్గొన్నారు.

# స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పి.ఆర్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా**

**ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపిన విద్యార్థులు**

**2001-2002 బ్యాచ్ కి చెందిన విద్యార్థులు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం స్టేడియం గ్రౌండ్ ఎదురుగా పి.ఆర్ ఫంక్షన్ హాల్ నందు 2001-2002 పదవతరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా ఏర్పాట్ చేశారు ఇట్టి కార్యక్రమములో ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు ఒక్కొకరు ఒక్కొక్క హెూదా లో పోలీస్,టీచర్,బ్యాంక్ మేనేజర్, డాక్టర్,సింగరేణి జీ.యం,ఫోటో గ్రాఫర్,రియల్ ఎస్టేట్,ప్రవేట్ జాబ్స్,ఆర్.టి.సి,రాజకీయాలలో,లిరిక్ రైటర్ గా ఎవరికి నచ్చిన వృత్తి లో అందరూ సెట్ అయ్యారు,అందరూ కూడా స్నేహితుల దినోత్సవం రోజు ఇరువై మూడు సంవత్సరాల తర్వాత అందరూ కలవడం వారి వారి జ్ఞాపకాలను పంచుకుని భావోద్వేగానికి గురి అయ్యారు సంతోషం వ్యక్తపరిచారు,స్నేహం అంటే కేవలం కలిసిన వెంటనే నా క్లాస్ మెంట్ అని మాత్రమే కాకుండా ఎవరూ కూడా కష్టాల్లో ఉంటే వారి కష్టాల్లో కూడా స్నేహితులు అందరూ కూడా చేదోడు వాతోడు గా ఉంటూ ముందుకు సాగుతున్నారు ఇట్టి స్నేహం చిరకాలం



ఉండాలని,మి పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలని బాగా చదివించి మంచి ఉన్నత స్థాయిలో ఉండే విధంగా,అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉండే విధంగా చేయాలని ఉపాధ్యాయులు తెలిపారు అనంతరం ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు వారి కుటుంబాలతో కలిసి భోజనాలు చేసి అనంతరం వారి వారి అభిప్రాయాలు తెలియజేశారు వెంటనే కాల్చలర్ ప్రోగ్రామ్స్ చేసి ఆనందంగా గడిపారు అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు

ఇట్టి కార్యక్రమములో బ్యాంక్ మేనేజర్ జగన్,టీచర్ కత్తుల సతీష్,డాక్టర్ సతీష్,టీమ్ లీడర్ గుంపుల శ్రీనివాస్,దేవేందర్,ఏలూరి రాజేష్ కుమార్,వాడపల్లి రమేష్ బాబు,సందీప్,జోగి వెంకటేశ్వర్లు,శంకర్,అన్వర్,హైమద్,ముత్యాల రమేష్,రాజేశ్వరరావు,సాగర్ బాబు,గారే శ్రీనివాస్,కృష్ణ,రఘు,చెవుల బాలకృష్ణ,స్వర్ణ లత,కవిత,మల్లీశ్వరి,బిపాషా, తదితరులు పాల్గొన్నారు

# లయన్స్ టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చింతల సురేష్ ఆర్థిక సహకారంతో పలు సేవా కార్యక్రమాలు.




ఈరోజు టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ చింతల సురేష్ గారి పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా మొదటగా తొర్రూరులోని పాటి మీద శివాలయంలో టీచర్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం గావించి పాటిమీద దేవాలయం అర్చకునికి పూజా సామాగ్రి పంపిణీ మరియు వస్త్రదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అవసరార్థులకు పండ్లు బ్రెడ్, పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సేవ కార్యక్రమంలో భాగంగా మాటేడు లోని గ్రామపంచాయతీ సిబ్బందినీ శాలువాతో సన్మానించి బ్రెడ్ పండ్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎద్దు వెంకన్న మాట్లాడుతూ టీచర్స్ క్లబ్ సేవ మార్గం సేవ లక్ష్యంతో పనిచేస్తుందని, ఈరోజు చింతల సురేష్ జన్మదిన సందర్భంగా అవసరార్థులను గుర్తించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, మాటేడు లోని గ్రామపంచాయతీ సిబ్బందికి శ్రమను గుర్తించి శాలువాతో సన్మానించి బ్రెడ్ పండ్లు పంపిణీ చేయడం జరిగిందనీ అన్నారు. ఈరోజు జన్మదినం జరుపుకుంటున్న చింతల సురేష్ గారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జన్మదిన సేవ కార్యక్రమాల్లో భాగంగా అవసరార్థులకు చేయూతను అందించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు కూడా సేవ మార్గాన్ని అనుసరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి ఇల్లందుల శ్రీనివాస్, కోశాధికారి తోట రమేష్, క్లబ్ డైరెక్టర్ చింతారామయ్య పాల్గొన్నారు .

# గృహ నిర్మాణానికి భూమి పూజ

**ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతుల.**

తొర్రురు మండలం చెర్లపాలెం గ్రామంలో ఆదివారం నాడు భూమి పూజ కార్యక్రమం జరిగింది. పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ఆమె భర్త రాజారాంమోహన్ రెడ్డి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి , ఆమె భర్త శ్రీ డా, రాజేందర్ రెడ్డి కలిసి తమ సొంత గ్రామమైన చెర్లపాలెంలో నూతన గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు..వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయ పద్ధతిలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా, గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై నేతల కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, మహిళా సంఘాల నాయకురాళ్లు, యువజన ప్రతినిధులు నేతలకు ఘన స్వాగతం పలికారు..

చెర్లపాలెం మా కుటుంబానికి అత్యంత ఆత్మీయమైన గ్రామం. ఇక్కడ ఇల్లు నిర్మించుకోవాలనే మా కల నేడు భూమి పూజతో నెరవేరుతోంది. గ్రామ అభివృద్ధికి



ఎల్లప్పుడూ కృషి చేస్తాం, అని తెలిపారు..టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ. గ్రామ ప్రజలతో కలిసి మమేకమవుతూ, వారి సమస్యల పరిష్కారానికి ముందుండడమే మా బాధ్యతగా భావిస్తున్నాం. ఇల్లు పూర్తయ్యాక గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తాము అని అన్నారు..కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బ్లాక్ అధ్యక్షులు, వివిధ మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ యువజన నాయకులు, మహిళ నాయకులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు, కుటుంబ బంధువులు పాల్గొన్నారు..

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభం లబ్ధిదారుల్లో హర్షం



**భాస్కరపురంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారె**

అసరా పేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండలం భాస్కరపురం గ్రామంలో గత ప్రభుత్వ కాలంలో నిర్మాణం ప్రారంభించి అసంపూర్ణంగా వదిలివేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక చొరవతో మిగిలిన నిర్మాణాలు పూర్తి చేయించి ఈరోజు లబ్ధిదారులకు అందజేశారు ఇళ్ల ప్రారంభంతో ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారుల సొంతింటి కల నెరవేరింది ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

ఎడిటోరియల్

# గ్రంథాలయాలకు జవజీవాలు



గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలు. మారుతున్న కాలానుగుణంగా వాటిని ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విజ్ఞానం కోసం గ్రంథాలయాలను ఆశ్రయించి ఎంతో మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. పుస్తకం హస్తభూషణం అన్న రోజులు పోయాయి. గ్రంథాలయం ఇప్పుడు కంప్యూటర్లలోకి చేరింది. టాబ్లెట్, సెల్ ఫోన్‌లోకి అమరిపోయింది. కాని ఎంతమందికి అవి అందుబాటులో ఉన్నాయన్నది అనుమానమే. ప్రతి వ్యక్తికీ సొంతంగా ఇంటర్నెట్, కంప్యూటర్ దానికి కావలసిన హంగులు అన్ని సమకూర్చగలమా అనేది ప్రశ్న. డబ్బు కలిగినవాళ్ళ పిల్లలకే పూర్తిగా అందుబాటులోకి రాలేదు. ఇక మధ్యతరగతి, పేద పిల్లలకు అందుతుందనేది పగటి కలే. ఇంటర్‌నెట్‌లో పుస్తకం చదవడం కన్నా లైబ్రరీలకు వెళ్లి పుస్తకాలు చదివే సంస్కృతి నేర్పాలి. అయితే ప్రస్తుతం దేశంలో, ముఖ్యంగా యువతరంలో గ్రంథాయల స్ఫూర్తి లోపించినట్లు కనిపిస్తున్నది. ప్రభుత్వం గ్రంథాలయాలను పట్టించుకోవడం లేదు.

పాత పుస్తకాలకు రక్షణ లేదు. కొత్త పుస్తకాలు తెప్పించరు. ఒకవేళ తెప్పించినా 100%లో 30% నుండి 40% వరకు మాత్రమే కొత్త పుస్తకాలు అందుబాటులో ఉంటున్నాయి. తెప్పించిన పుస్తకాలలో వ్యాపారుల ఒత్తిడికి లొంగి అత్యంత ఉపయోగంలేని పుస్తకాలకే ఆర్డర్లు, ఈ పుస్తకాలను చూసే ఉద్యోగులు తగినంత మంది లేకపోవడంతో వాటిని చదువుకునే వారికి ఇవ్వడం కూడా తగ్గింది. గ్రంథాలయ సెస్ మాత్రం ప్రజల నుండి ఇంటింటి వసూలు చేయబడుతూనే ఉంది. అసలు ఈ విషయం ఇంటి పన్ను కట్టే ప్రజలకు తెలియడం లేదు. వారికి దగ్గరలో ఉన్న గ్రంథాలయాల్లో సరియైన వసతులు లేవు. ఏవో ఒకటి లేదా 2, 3 పేపర్లతో మాత్రమే సరిపెడుతున్నారు. ఇక కేంద్ర గ్రంథాలయాల్లో కొత్త కొత్త పుస్తకాలతో, కొత్త శాస్త్ర పరిజ్ఞానం ఉపయోగించే కంప్యూటరీకరణతో, అన్ని హంగులతో ఏర్పాటు చేసినా అవి సంపూర్ణంగా అభివృద్ధి చెందడం లేదు. అవి ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. ముఖ్యంగా సంవత్సరం సిలబస్ మారుతుంటే దానికి సంబంధించిన ప్రభుత్వ పుస్తకాలు ప్రింట్ కాక, అందుబాటులోకి రాక సామాన్య ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ప్రజలలో గ్రంథాలయాల ప్రాముఖ్యాన్ని తెలియజెప్పాలి. ఎక్కడో ఒక దగ్గర మీకు తెలిసిన గ్రంథాలయానికి వెళ్ళి చూడండి. వేలాది మంది విద్యార్థులు చెట్లకింద, నేల మీద కూర్చొని చదువుకుంటారు. ఎక్కువమంది ఇంట్లో చదువుకునే పరిస్థితి లేదు. సరియైన వసతులు లేవు. మంచి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా? లేదా అనే ప్రశ్న ఒకటైతే అవి తెలుగుభాషలో దొరుకుతాయా అన్నది మరో ప్రశ్న? గ్రంథాలయాల్లో నూతనంగా ఏర్పడే మిత్రుల వల్ల కూడా మంచి ప్రయోజనం ఉంటుంది. కంప్యూటర్ వ్యవస్థ అభివృద్ధి చెందిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా గ్రంథాలయాలను అభివృద్ధి పరుచుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. తెలుగు గ్రంథాలయాల ఉద్యమం ఓ చరిత్ర. తెలుగులో గ్రంథాలయాల కోసం ఉద్యమం నడిపిన ప్రముఖులలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, అనంతరం ఉద్యమాన్ని ఉధృతి చేసి వ్యాప్తి చేసిన క్రియాశీలి వెలగ వెంకటప్పయ్య. దేశంలో అతి పురాతన గ్రంథాలయం. ఇలా గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జన, సంరక్షణ చేయాలనే దృక్పథం తెచ్చేందుకు ఈగ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పినట్టు చిరిగిన చొక్కానైనా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో అని ఒక పుస్తకం నీకు కొన్ని వేల మంది వ్యక్తులకు సమానం కాబట్టి పుస్తక పఠనం అవసరం దానిని చిన్ననాటి నుండే పిల్లల్లో పెంపొందింపజేసినట్లయితే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి తోడ్పడుతుంది. ఆ దిశగా అందరం ప్రయత్నం చేయాలి. గ్రంథాలయాలను మెరుగుపరుచుకుందాం. భావితరాల భవిష్యత్తు పునాది వేద్దాం. అపుడే నేటి యువత విజ్ఞానవంతులై రాష్ట్రానికి, దేశానికి, వారు కన్న తల్లిదండ్రులకు, మంచి పేరు తీసుకొస్తారు.

# దడ పుట్టిస్తున్న సైబర్ మోసాలు



నాణేనికి బొమ్మా బొరుసూ ఉన్నట్లుగానే సమాజంలో మంచీ చెడూ కూడా పక్కపక్కనే ఉంటాయి. ఏది మంచో, ఏది చెడో గుర్తించి మసలుకోవడంపైనే మన తెలివితేటలు ఆధారపడి ఉంటాయి. నానాటికీ కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానమూ ఇంతే. దీంతో ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో, అన్ని దుష్ప్రయోజనాలూ ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెచ్చుమీరుతున్న సైబర్ నేరాలకు ఈ సాంకేతిక పరిజ్ఞానమే ఆధారభూతమవుతోంది. కొత్తరకం పరిజ్ఞానాన్ని ఇట్టే అందిపుచ్చుకుని అవకాశాలు వెతుక్కోవడంలో భారతీయులు ముందుంటారు. మూడు దశాబ్దాల క్రితం సమాచార సాంకేతిక పరిజ్ఞానం కొత్తగా వెలుగుచూసినప్పుడు సంబంధిత కోర్సులను అందరికంటే ముందుగా అభ్యసించి అవకాశాలను వెతుక్కుంటూ పాశ్చాత్య దేశాల్లో పాగా వేసినవారిలో అగ్రగణ్యులు మనవాళ్లే. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో ఐటి రంగంలో భారతీయులు అగ్రస్థానాల్లో ఉండటానికి కారణం వారి ముందుచూపే. అయితే ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరా చేసుకుని మోసాలు చేయడంలోనూ మనవాళ్లు ఆరితేరిపోయారనేదే విచారించదగిన అంశం.

లింక్ పంపించి దాన్ని క్లిక్ చేస్తే కోట్ల రూపాయలు వచ్చి ఒళ్లో వాలతాయని నమ్మించి మోసం చేయడం, పిన్ నంబర్ చెబితే వెంటనే ఖాతాలో లక్షల రూపాయలు డిపాజిట్ చేస్తామంటూ బురిడీ కొట్టించడం పాత పద్ధతి. అమాయక జనాన్ని మోసం చేస్తే వచ్చే లాభం అంతంతమాత్రంగానే ఉంటుంది కాబట్టి, బాగా చదువుకున్నవారినే టార్గెట్ చేసుకుని, వలలోకి లాగి కోట్ల రూపాయలు కాజేస్తున్న సైబర్ నేరగాళ్ల ఆగడాలు ఇప్పుడు ఎక్కువైపోయింది. ఇటీవల భాగ్యనగరానికి చెందిన ఓ డాక్టర్‌ను ట్రేడింగ్ బిజినెస్ పేరిట సైబర్ నేరగాళ్లు బుట్టలో వేసుకుని, 34 విడతలుగా పదకొండు కోట్లకు పైనే తమ ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. మరో సంఘటనలో ఓ వితంతు మహిళని ట్రాయ్ అధికారులమంటూ బెదిరించి ఐదున్నర కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. ఈ రెండు సంఘటనల్లోనూ బాధితులు, మోసగాళ్లు భారతీయులే కావడం, పైగా విద్యాధికులే కావడం విశేషం. తాజాగా డిజిటల్ అరెస్టు పేరిట బెదిరింపులు ఎక్కువయ్యాయి. సైబర్ నేరగాళ్లు తమను తాము పోలీసులమనో, కోర్టు అధికారులమనో పరిచయం చేసుకుని నకిలీ అరెస్టు వారెంట్లు లేదా సమన్లు పంపించి బెదిరిస్తారు. ఆన్‌లైన్‌లో జరిమానా చెల్లిస్తే గండం గట్టెక్కవచ్చని నమ్మబలుకుతారు. ఈ తరహా డిజిటల్ అరెస్టులపై అవగాహన లేకపోవడంతో బాధితులు నిజమేనని నమ్మి మోసపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ సైబర్ నేరగాళ్ల ఆగడాలు రానురాను పెచ్చుమీరుతున్నాయి. ఇటీవల ఒడిశాకు చెందిన ఓ రిటైర్డ్ డాక్టర్‌ను బురిడీ కొట్టించి కోటి రూపాయలు కాజేసిన నిందితుడు నిజామాబాద్‌లో పట్టుబడ్డాడు. మరో సంఘటనలో సైబర్ ముఠాలకు ఇతరుల వ్యక్తిగత సమాచారాన్ని చేరవేసి, పరోక్షంగా సైబర్ నేరాలకు సహకరిస్తున్న ఓ యువకుడిని నిర్మల్‌లో పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణలో సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపడంలో రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అవిశ్రాంతంగా కృషి సలుపుతోంది. గత నెలలో రాష్ట్రంలో పలు నేరాలతో సంబంధం ఉన్న 48 మందిని అరెస్టు చేసి, కటకటాల వెనక్కు నెట్టారు. ఉద్యోగాలపేరిట ఇక్కడి యువతకు గాలం వేసి, కంబోడియాకు తరలించి వారి చేత సైబర్ నేరాలు చేయిస్తున్న ముఠాలోని కీలక వ్యక్తిని అరెస్టు చేయడం ఇటీవల తెలంగాణ సైబర్ పోలీసులు సాధించిన ఘనవిజయాల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ఇటీవల 'మన్ కీ బాత్' లో ప్రధాని ఆందోళన వెలిబుచ్చడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. బాధితులు సకాలంలో పోలీసులకు సమాచారం చేరవేయడంలో జాప్యం చేయడం, నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంలో బ్యాంకు అధికారుల ఉదాసీన వైఖరి కూడా మోసగాళ్లకు వరంగా మారుతున్నాయి. ఈ విషయంలో పోలీసులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేస్తే తప్ప నేరాలకు ముకుతాడు పడే అవకాశం లేదు. సైబర్ నేరాలపై ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు పోలీసులు శ్రమిస్తున్నా ఫలితం అంతగా కానరావడం లేదు. ఈ విషయంలో పోలీసులతోపాటు బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థలు కూడా నడుం బిగించవలసిన అవసరం ఉంది. సైబర్ మోసాలపై హైస్కూలు స్థాయి నుంచి కోర్సులు ప్రవేశపెట్టే విషయాన్ని ప్రభుత్వాలు పరిశీలించాలి. ప్రతి పోలీస్ స్టేషన్లోనూ సైబర్ సెల్ ఏర్పాటు చేసి, నిపుణులను నియమించడం వల్ల సాధ్యమైనంత వరకూ నేరాల వ్యాప్తిని నిరోధించవచ్చు.

# బీటలు వారుతున్న వివాహ వ్యవస్థ



విడాకుల తర్వాత భర్త నుంచి భార్య పొందే భరణానికి సంబంధించిన నిబంధనలు భార్య సంక్షేమానికి ఉద్దేశించినవే తప్ప భర్తను భయపెట్టేందుకో, శిక్షించేందుకో లేక దోపిడీ చేసేందుకో ఉద్దేశించినవి కావంటూ సుప్రీం కోర్టు తాజాగా చేసిన వ్యాఖ్యలు ఎన్నదగినవి. భార్యా బాధితులకు ఊరటనిచ్చేవి కూడా. తన భర్త సంపదకు తగినట్లుగా తనకు భరణం ఇప్పించాలంటూ కేసు వేసిన ఓ గృహిణిని సర్వోన్నత న్యాయస్థానం మందలిస్తూ, ఒకవేళ విడాకులు తీసుకున్నాక భర్త ఆర్థిక పరిస్థితి దిగజారితే బాధ్యత తీసుకుంటారా? అని ప్రశ్నించడం సహేతుకమే. భర్త, అత్తింటివారినుంచి డబ్బు వసూలు చేయాలన్న లక్ష్యంతోనే ఇలాంటి తీవ్రమైన ఆరోపణలతో కేసులు పెడుతున్నారని కూడా ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించడం గమనార్హం. మనోవర్తి అనేది రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కే కాదు, మానవ హక్కుల్లో అది ఒక భాగమని గతంలోనూ సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక వివాహ చట్టం, హిందూ వివాహ చట్టం, నేర న్యాయస్మృతి వంటివి మనోవర్తికి సంబంధించిన అంశాలను వివరిస్తున్నాయి. ఈ చట్టాలలోని లొసుగులను ఆధారం చేసుకుని భర్తనుంచి ఎక్కువ డబ్బు గుంజాలనుకునే మహిళలకు తాజా తీర్పు చెంపపెట్టులాంటిదే. గృహహింస నిరోధక చట్టమూ ఇలాంటి ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. తమను రాచిరంపాన పెట్టే భర్తలనుంచి, అత్తమామలనుంచి గృహిణులకు రక్షణ కల్పించే ఉద్దేశంతో 2005లో అమలులోకి వచ్చిన ఈ చట్టం కొందరు మహిళలకు పెట్టనికోటలా మారింది. అత్తమామల్ని, భర్తనూ వేధించేందుకు ఈ చట్టం కొందరికి ఆయుధంగా మారుతోందని పలు సందర్భాల్లో న్యాయస్థానాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వివాహిత స్త్రీలకు గృహహింస నుంచి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన సెక్షన్ 498ఎ దుర్వినియోగమవుతోందంటూ గతంలో కలకత్తా హైకోర్టు వ్యాఖ్యానించింది. భర్తతో విభేదించిన మహిళలు అతని తరపు బంధువులందరినీ నిందితులుగా చూపుతున్నారంటూ బాంబే హైకోర్టు ఒక సందర్భంలో అసహనం వ్యక్తం చేసింది. మరో కేసులో అలహాబాద్ హైకోర్టు తీర్పు చెబుతూ పెళ్లికి సంబంధించిన ప్రతి కేసునూ వరకట్న వేధింపుల ఆరోపణలతో పెద్దదిగా చూపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ పేర్కొంది. అంతెందుకు, బెంగళూరుకు చెందిన ఓ టెకీ ఆత్మహత్య ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చనిపోయేముందు 80 నిమిషాల సేపు ఆయన చిత్రీకరించిన వీడియోలోనూ, 40 పేజీల సుదీర్ఘ లేఖలోనూ తన భార్య పెడుతున్న చిత్రహింసల గురించి వివరించిన తీరు మానవతావాదుల హృదయాలను ద్రవీభవింపజేసిందంటే అతిశయోక్తి కాదు. ఈ కేసు విషయంలో సుప్రీం కోర్టు%ా% వరకట్నం వేధింపుల చట్టాలు దుర్వినియోగమవుతున్నాయనీ, ఇలాంటి కేసుల విచారణలో జాగ్రత్తగా వ్యవహరించాలని న్యాయస్థానాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఇదే సందర్భంలో విడాకుల తర్వాత భార్యకు ఎంత భరణం ఇవ్వాలో లెక్కించేందుకు ఎనిమిది అంశాలతో మార్గదర్శక సూత్రాలను కూడా జారీ చేసింది. ఒకప్పుడు ఉద్యోగం పురుష లక్షణం అనేవారు. ఇప్పుడు ఆ నానుడికి కాలం చెల్లింది. గతంలో వంటింటి కుందేళ్లుగా ఉన్న మహిళలు ఇప్పుడు పురుషులతో సమానంగా విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. పురుషాధిక్య ప్రపంచపు కోటలను బద్దలు కొట్టి అన్ని రంగాలలోనూ దూసుకుపోతున్నారు. మంచిదే, అయితే, కాపురాన్ని ముందుకు నడిపించేవి దంపతులు మధ్య ప్రేమాభిమానాలు, ఆప్యాయతానురాగాలే తప్ప, ఒకరిపై ఒకరు చూపే ఆధిపత్య ధోరణులు ఎంతమాత్రం కాదు. పవిత్రమైన హిందూ వివాహ వ్యవస్థ ఇటీవల పలుమార్లు కాలపరీక్షకు లోనవుతోంది. వివాహంపైనా, జీవితంపైనా సరైన అవగాహన లేని దంపతులు చిన్నాచితకా వివాదాలను కూడా భూతద్దంలోంచి చూస్తూ విడాకుల కోసం కోర్టుకు ఎక్కుతున్నారు. ఒకప్పుడు కాపురాల్లో కలతలు రేగితే పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పేవారు. ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది. పిల్లలు విడాకులు తీసుకోవాలనుకుంటే సర్దిచెప్పడం అలా ఉంచి, పెద్దలే దగ్గరుండి విడాకులు ఇప్పించే పరిస్థితులు దాపురించాయి. మరోవైపు, వివాహ వ్యవస్థ ఒడిదుడుకులకు లోనవుతున్న విషయాన్ని గమనిస్తున్న యువతీయువకులు పెళ్లిని కాదని, సహజీవనం వైపు మొగ్గుచూపుతున్నారు. దీని వల్ల భారతీయ వివాహ వ్యవస్థ ఉనికే ప్రమాదంలో పడుతోంది. గృహ హింస, మనోవర్తి చట్టాలు దుర్వినియోగమవుతున్నంత మాత్రాన వాటిని రద్దు చేయాలనే వాదనలు ఎంతమాత్రం సహేతుకం కాదు. ఇప్పటికీ సమాజంలో మహిళలపట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. గృహహింసకు లోనవుతూనే ఉన్నారు. కాబట్టి, వారికి రక్షణగా రూపొందిన చట్టాలలోని లొసుగులను పరిహరించే ప్రయత్నం జరగాలి. వాటిని ఆసరా చేసుకుని భర్తలను, అత్తమామలను వేధించాలనుకునే మహిళల భరతం పట్టేలా చట్టాలను పటుతరంగా రూపొందించాలి. లేనిపక్షంలో పవిత్రమైన వివాహ వ్యవస్థ నాశనమయ్యే ప్రమాదం లేకపోలేదు.

# కుల రక్కసి కరాళ నృత్యం అంతం చేద్దాం!



కర్నూలు జిల్లాలో కులరక్కసి కరాళ నృత్యం చేస్తోంది. కెవిపిఎస్ ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో వళ్ళు గగుర్పొడిచే నిజాలు బయటపడ్డాయి. సుమారు ఎనభైతొమ్మిది గ్రామాల్లో పదిహేను రకాల కులవివక్షలు కనిపించాయి. అరవైనాలుగు గ్రామాల్లో దళితులకు దేవాలయ ప్రవేశంలేదు. ముప్పయి గ్రామాల్లో దళితులు రచ్చబండపై కూర్చోవడానికి వీల్లేదు. ఇప్పటికీ అక్కడ ఏడు గ్రామాల్లో టీ కొట్లలో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతూ ఉంది. ఆరు గ్రామాల్లో దళితుల్ని హొటళ్ళలోకి అసలే అనుమతించరు. ఇరవైఏడు గ్రామాల్లో చాకలివారు దళితుల బట్టలు ఉతకరు. తొమ్మిది గ్రామాల్లో క్షురకులు దళితులకు క్షవరం చేయరు. ఈ పనుల కోసం వారు సమీపంలోని పట్టణాలకు వెళుతున్నారు.

"జుట్టు కత్తిరించడం మంగలి యొక్క పవిత్రమైన ధర్మం కాదు. ఇది ఒక వ్యాపారం. చెప్పులు కుట్టడం మాదిగవాడి పవిత్ర ధర్మం కాదు. అది కూడా వ్యాపారమే! ప్రదర్శించే పూజలు, హొమాలు, ఉత్సవాలలో కూడా అది జరుగుతోంది. ఇది బ్రాహ్మణుడి పవిత్రమైన ధర్మమేమీ కాదు. అలా అనుకోవడం మన అజ్ఞానం. మన అజ్ఞానం మీదే బ్రాహ్మణుడికి తిని కూర్చునే పెద్ద వ్యాపారం జరుగుతూ ఉంది!" అని అన్నారు మహాత్మా జ్యోతిరావు ఫూలే. ఆధునికులుగా మనకు తోచకపోతే పోయింది. కనీసం కొందరు మహానుభావులు చెప్పిన దాంట్లోంచి సారాంశమైన గ్రహించాలి కదా? ఇదే విషయం మీద డాక్టర్ రామ్ మనోహర్‌లోహియా ఏం చెప్పారో గమనించండి...

"బ్రాహ్మణులు, కోమట్లు, షేక్‌లు, సయ్యద్‌లు పెద్ద కులాలకు చెందినవారు. కమ్మరి, కుమ్మరి, మంగలి, చాకలి, సాలె, మాల, మాదిగలు చిన్న కులాల వారు. వీరి సంఖ్య 90శాతం దాకా ఉంది. కుల భేదాల వల్ల వీరి మేధస్సు బందీ అయిపోయింది. వీరిని పైకి తెస్తే తప్ప, దేశ పునర్నిర్మాణం జరగదు. కాళ్ళూ, చేతులూ కదిలించకపోతే శరీరానికి పక్షవాతం వచ్చినట్లు... దేశానికీ పక్షవాతం వచ్చింది. దేశంలోని ఈ 90శాతం ప్రజలకు రెండువేల సంవత్సరాలుగా పక్షవాతం వచ్చింది. సమాజంలో వీరిని ఎక్కడికక్కడ పాతరేసి స్థిరపరిచారు. కదలిక లేకుండా చేశారు. బానిసత్వానికి మూల కారణం ఇదే. ఇప్పటికైనా మారకపోతే మరోసారి బానిసలమయ్యే ప్రమాదముంది."

ఇలాంటి హెచ్చరికల్ని మనం ఇప్పటికైనా పట్టించుకోవాలా? వద్దా? ఇరవై ఒకటవ శతాబ్దపు అత్యాధునికులమని గొప్పలు పోవడం కాదు, అందుకు తగిన విధంగా ఆలోచనా సరళిని మార్చుకోవాల్సి ఉంది.

మంత్రాలయ మఠంలో- చదువుకున్న దళితులైనా సరే, కేవలం ఉద్చడానికే అర్హులు! ఆ పని తప్ప మరో పని చేయనివ్వరు. బిల్లులు రాయడానికి గానీ, రిసెప్షనిస్టులుగా పని చేయడానికి గానీ వారికి అవకాశమివ్వరు. అక్కడవారు చదువుకున్న చదువు వృథా కావల్సిందే! కొన్ని ఊళ్ళలో దళితులు మోటారు వాహనాలపై తిరగకూడదు. పెళ్ళి ఊరేగింపులు సైతం వాహనాలపై చేసుకోగూడదు. కాలి నడకన వెళ్ళాల్సిందే. మంచి నీటి బావుల్లోకి సైతం దిగనివ్వరు. బావిలోంచి నీరే తోడుకోనివ్వనప్పుడు, ఇక నీళ్ళలోకి దిగి పనులు చేయనిస్తారా? దళితులతో కలిసి సహపంక్తి భోజనం చేయడమన్నది ఊహకు అందని విషయం. మంత్రాలయ మండలంలోని బసాపురంలో పెత్తందార్ల కార్లు వెళుతూ ఉంటే ఎంతటి విద్యావంతులైన, దళితులయినా సరే... టక్కున లేచి నిలబడి వంగి నమస్కారం పెట్టాల్సిందే. కర్నూలు మండలం దేవమడ గ్రామంలోనూ ఇంకా కొన్ని చుట్టుపక్కల గ్రామాల్లోనూ గ్రామ వాలెంటీర్‌లు దళితుల ఇండ్లకు వెళ్ళరు. వాళ్ళనే తమ ఇళ్ళకు పిలిపించుకుంటారు. ఉళ్ళోని ప్రతి ఇల్లూ తిరగడమన్నది గ్రామ వాలంటీర్ల ఉద్యోగ ధర్మం. దాన్ని పక్కన పెట్టి వ్యవహరించడం ఎంత తప్పు? అయితే వారిని అడిగేవారు లేరు. మన తెలుగు రాష్ట్రాల్లోనే ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇంతటి వివక్ష కొనసాగుతూ ఉందంటే... మనుషులుగా మనమంతా తలవంచుకోవాలి. అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వోద్యోగులు, పరిపాలకులు సిగ్గుపడాలి!

కర్నాటకలో కొప్పల్ జిల్లా మయాపూర్ గ్రామంలో అగ్రవర్ణం వారు దళిత కుటుంబానికి ఇరవై అయిదు వేల రూపాయల జరిమాన విధించారు. ఎందుకంటే ఒక దళితుడు గుడి బయట నిలబడి, కళ్ళు మూసుకుని దేవుడికి దండం పెట్టుకుంటున్నాడు. ఆ సమయంలో వెంట ఉన్న అతని రెండేండ్ల కొడుకు గబుక్కున గుళ్ళోకి వెళ్ళిపోయాడు. తను దళితుడినని, తను గుళ్ళోకి వెళ్ళకూడదని ఆ పసివాడికి తెలియదు. ఆ రోజు ఆ పసివాడి పుట్టిన రోజు. అందుకే వాణ్ణి తీసుకుని తండ్రి గుడికి వెళ్ళాడు. వాణ్ణి చల్లగా చూడమని కోరుకుంటూ ఆ దళితుడు దండం పెట్టుకుంటూ ఉండగా... ఆ "ఘోర ప్రమాదం" జరిగిపోయింది. ఒక దళితుడు గుళ్ళోకి జొరబడ్డాడని, గుడి మైల పడిందనీ, దాన్ని ప్రక్షాళన చేయాలని... అందుకు 25వేలు ఖర్చు అవుతుందనీ పూజారులు బెదిరించారు. తనకు అంతశక్తి లేదని, తను ఒక నిరుపేదనని దళితుడు ఎంత మొత్తుకున్నా లాభం లేకపోయింది. అగ్రవర్ణ అహంకారం తగ్గలేదు. పెద్ద గలాటా జరిగింది. ప్రభుత్వాధికారుల చొరవతో విషయం సద్దుమణిగింది. ఇంగిత జ్ఞానం లేక, మానవత్వం లేక మనుషులు ప్రవర్తిస్తున్నప్పుడు - గోరుతో పోయేది గొడ్డళ్ళదాకా వస్తుంది. ఇది 2021 సెప్టెంబర్ సంఘటన. ఇలాంటి సంఘటనే తమిళనాడులో జరిగింది. ఒక గుళ్ళోకి దళిత మహిళను రానియ్యలేదు. ఆ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌కు తెలిసింది. వెంటనే ఆ గుడికి సంబంధించిన ఇరవైమంది పూజారుల మీద ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టించి వారిని జైలుకు పంపాడు. ఇతర రాష్ట్రాలలో కూడా అలా చేయగలిగే అవకాశం ఆయా మంత్రులకు, ముఖ్యమంత్రులకు ఉంటుంది. రాజ్యాంగం గురించి అందరూ గొప్పగా మాట్లాడుతారు కానీ, ఎవరైనా అలా చేస్తున్నారా?

మహిళల అభ్యున్నతికై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ స్త్రీలకు బస్సు ప్రయాణం ఉచితం చేశాడు. ఒకరోజు కన్యాకుమారి జిల్లా వాణీయం కుడి గ్రామానికి చెందిన సెల్వం అనే డెబ్బయేండ్ల మహిళ తన చేపల బుట్టతో బస్సు ఎక్కింది. చేపలు వాసన వస్తున్నాయంటూ కండక్టర్ బలవంతంగా ఆమెను బస్సు నుండి దింపేశాడు. అవి నిలువ చేపలు కావని, ఆ రోజు పట్టినవేనని, చేపలన్నాక కొంచెం వాసనొస్తాయనీ, అయినా తను ఎక్కువ దూరమేమీ రావడం లేదని ఆ వృద్ధురాలు ఎంత మొత్తుకున్నా కండక్టర్ వినలేదు. 'పాపం పోనీయండి' - అని తోటి ప్రయాణీకులు చెప్పినా, అతను వినిపించుకోలేదు. బలవంతంగా దింపేశాడు. ఆమె కుళచ్చల్ బస్టాండ్‌లో అందరికీ తనకు జరిగిన అన్యాయం చెప్పుకుంది. ఆనోటా ఆనోటా అది సోషల్ మీడియాకెక్కింది. రవాణాశాఖ అధికారులకు, తర్వాత ముఖ్యమంత్రికీ తెలిసింది. ఆ వృద్ధురాలి హక్కును కాదన్నందుకు ఆ బస్సు కండక్టర్, డ్రైవర్‌లను సస్పెండ్ చేశాడు స్టాలిన్. అణగారిన వర్గాలకు ఎక్కడికక్కడ న్యాయం జరగాలంటే చిత్తశుద్ధి ఉన్న నాయకులు కావాలి. ఉట్టి 'భాషణ్'లిచ్చే నాయకులు వృథా కదా మిత్రోఉ?

మనుస్మృతి ప్రకారం మహిళలందరూ శూద్రులే. మహిళలకు పుట్టిన వారంతా శూద్రులే అవుతారు కానీ, మళ్ళీ అందులో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఎలా పుట్టగలరూ? పుట్టిన వాళ్ళందరూ శూద్రులే అయినప్పుడు అగ్ర-నిమ్న వర్గాలెందుకూ? ఇదంతా బుద్ధి తక్కువ వ్యవహారంగా అనిపించడం లేదూ? అది అలా ఉండనిచ్చి మరొక విషయం చూద్దాం. హిందూ దేవుళ్ళలో బ్రాహ్మణులు లేరు. అధిక భాగం క్షత్రియులే. అలా అయినప్పుడు బ్రాహ్మణ వర్గానికి మొదటి స్థానం ఎవడిచ్చాడు? ఇదంతా కాదు. మహిళలు శూద్రులయినప్పుడు, ఉన్న జనాభా అంతా శూద్రులే - అందరూ సమానులే. విజ్ఞాన శాస్త్రం అదే చెప్పింది - మానవజాతి అంతా ఒక్కటే కాబట్టి, అందరూ సమానులే - అని అంది. మనుధర్మ శాస్త్ర ప్రకారం కూడా మనుషులంతా సమానులే- అని మనం అర్థం చేసుకోవాలి. మనమంతా బాల్యంలో బాలకులం. యవ్వనంలో యువకులం. వృద్ధాప్యంలో పండుటాకులం... అంతే! మనువును తిరస్కరిస్తేనే ఎవరికైనా కాస్త బుద్ధిజ్ఞానం పెరుగుతుంది. రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు ఒక పెద్దాయన పక్కనున్న యువకుణ్ణి ఊహించని ప్రశ్న అడిగాడు. మీ కేస్ట్ ఏమిటీ అని! యువకుడు అందగాడే కాదు తెలివైనవాడు కూడా. విషయం గ్రహించి వెంటనే 'సాఫ్ట్‌వేర్' అండీ అన్నాడు.

"భలే జోకులేస్తావు బాబూ నేను అడిగింది వేరు. నువ్వు చెప్పేది వేరు. పోనీ, మీ నాన్నగారి కులమేమిటీ" అని మళ్ళీ అడిగాడు పెద్దాయన.

"ఆయనా? ఆయన ఎలక్ట్రికల్ అండీ" అన్నాడు యువకుడు.

'పోనీలే - నీకు చెప్పాలని లేనట్లుంది! ఈ మధ్య ఏమిటో కుర్రవాళ్ళు చిత్రమైన జవాబులు చెపుతున్నారు. కులం చెప్పుకుంటే నామోషీయేమో" - అని ముఖం మాడ్చుకుని, ముఖం కూడా తిప్పుకున్నాడు.

"మీరు పెద్దవారు. మీకు తిక్కతిక్కగా సమాధానాలు చెప్పాలని నాకు లేదు. విషయేమిటంటేనండీ... భగవద్గీతలోని నాలుగో అధ్యాయంలో పదమూడవ శ్లోకం ఒకసారి నెమరు వేసుకోండి. మీకే అర్థమవుతుంది!" అన్నాడు.

"అవునూ ఏముంది అందులో?" ఈ కుర్రాడికి గీతలోని విషయాలు కూడా తెలుసా? అని ఆశ్చర్యపోతూ అడిగాడు.

"గుర్తులేకపోతే ఫరవాలేదు. ఇంటికెళ్ళాక చూసుకోండి!" నవ్వుతూ బదులిచ్చాడు యువకుడు.

"సరే బాబూ చెబుదూ అందులో ఏముందో" అన్నాడు పెద్దాయన.

"ఏముందంటే... కులమనేది పుట్టుకతో కాదు, చేసే వృత్తితో వస్తుంది- అని ఉంది. దాని ప్రకారమే చెప్పానండీ అంతే - మిమ్మల్ని ఆటపట్టించాలని కాదు - మీకేమో కోపం వచ్చేసింది" అని నవ్వుకొనసాగించాడు. పెద్దాయనకు ఎక్కడో కలుక్కుమంది. 'జ్ఞానం' వయసు పెరిగితే రాదు - బుద్ధి పెరిగితేనే వస్తుందని అప్పుడే తెలుసుకున్నాడు. పాత తరహాలో ఇక మాట్లాడ గూడదని కూడా అనుకున్నాడు.

మనుస్మృతి ప్రకారం- (త్రిన్న:9/93) పురుషులు 24-30ఏళ్ళ వయసులో 8-12ఏళ్ళ వయసులో ఉన్న బాలికల్ని పెండ్లి చేసుకోవాలి. ఇదే కాదు 3-4 ఏళ్ళ బాలికలకు 7-8ఏళ్ళ బాలురకు కూడా పెళ్ళిళ్ళు చేసిన ఆచారం ఈ దేశంలో కొనసాగింది. మరి సమకాలీనంలో దాన్ని కొనసాగించడం లేదు కదా? అందుకే సంప్రదాయం ముసుగులో పనికిరాని ఆచారాల్ని వదిలేయాలి. అన్నీ ఆలోచించే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మనుస్మృతిని దహనం చేశాడన్న విషయం గుర్తుంచుకోవాలి!

**నేను విప్లవ కారుణ్ణి. అన్ని దేశాలూ నావే. నిజమైన విప్లవ కారుడు ఓ అద్భుతమైన ప్రేమికుడై ఉంటాడని నేను చెప్తే మీకు కాస్త ఆశ్చర్యంగానే ఉండొచ్చు. కానీ, ప్రేమించే గుణాన్ని కోల్పోయిన వాడు ఎన్నటికీ గొప్ప విప్లవకారుడు కాలేడు. ప్రపంచంలో ఎక్కడ ఎవరికీ అన్యాయం జరిగినా మనం గాఢంగా ప్రతి స్పందించడం చాలా అవసరం. ప్రతి వారికీ ఉండి తీరాల్సిన అద్భుతమైన లక్షణం అదే!**

## పుత్తడిబొమ్మ



పరిమళిస్తూ పువ్వులు పూస్తున్నాయ
పవన తరంగాలు పలుకరిస్తున్నాయ
పిల్లకాలువ పరుగులు పులకరిస్తున్నాయ
కోకిలమ్మ పాటలు వీనులవిందు
చేస్తున్నాయ
కానీ మనసు దోచిన పుత్తడిబొమ్మ
కానరాదే?
మమతల కోవెలలోని తలపులు
తెరవలేదే?

గోదారమ్మ హొయలు
పరుగులెడుతున్నాయ
చెట్లు కదిలి వానచినుకులు
తడిపేస్తున్నాయ
అందెల సవ్వడులు ఘల్లుమంటున్నాయ
అందమైన కురులు
సిగ్గులొలుకుతున్నాయ
కానీ మనసు దోచిన పుత్తడిబొమ్మ
కానరాదే?
కొలనులో విరిసిన తామరులు
పలుకలేదే?

ఇంద్రధనుస్సులోని రంగులు
కుంచెకంటాయ
పురివిప్పి మయూరములు
ఆటలాడుతున్నాయ
గువ్వా గోరింకలు గూటికి చేరుతున్నాయ
కానీ మనసు దోచిన పుత్తడిబొమ్మ
కానరాదే?
కమ్మని కలలుగన్న నా కంటికి
నిదురలేదే?

లేగదూడలు పాలకు చిందులేస్తున్నాయ
కడలి కెరటాలు తీరాన్ని తాకుతున్నాయ
తారకలు నింగిలో
మిలమిలమెరుస్తున్నాయ
కానీ మనసు దోచిన పుత్తడిబొమ్మ
కానరాదే?
తరుముతున్న తరంగాలు నిలకడగ
నిలువలేదే?

ఉత్తరాలన్నీ పుస్తకాలుగా మారుతున్నాయ
చెదలు పట్టిన కాగితాలు
చిరిగిపోతున్నాయ
ఎదురుచూపులతో కళ్ళు
అలసిపోతున్నాయ
కానీ మనసు దోచిన పుత్తడి బొమ్మ
కానరాదే?
కథ కంచికి చేరుతుంటే చివరి చరణం
పాడలేదే!

# బాలసాహిత్యంలో కాల్పనిక కథల పాత్ర

తెలుగులో కథ లేదా కత ఒక సాహితీ ప్రక్రియ. తెలుగు అకాడమీ నిఘంటువు ప్రకారం కథ అనగా కొంత సత్యాంశతో కూడిన కల్పిత గద్యగ్రంథం. కథ అంటే నీతి. కథ ఒక రీతి. కథ అంటే నిజాయితీ. పిల్లలను చేరదీసి కథలు చెప్తే ఆ కథలే పిల్లలను వేలుపట్టి నడిపిస్తాయి. నీతి చంద్రికలై దారి చూపుతాయి. రోబోటిక్ యుగంలో ఉన్నా అంతరిక్షం లో విహరించిన బేతాళ కథలు చెప్పాల్సిందే. చందమామ వంటి పుస్తకాలు చదవాల్సిందే ఎందుకంటే ఆ కాల్పనిక శక్తే మానవజాతిని ఇంతవరకు నడిపించింది. పసిమనసుల్లో ఎన్నో ఆలోచనలు రేకెత్తింపచేసింది. ఎందుకు? ఏమిటి? ఎలా అన్న ప్రశ్నలు ఉదయింపచేసి పరిష్కారాలను ప్రసరింప చేసింది. అందుకే కథలు చెప్పకు అని పిల్లలను చిన్నబుచ్చకూడదు. వాళ్ళు చెప్పింది సావధానంగా వినాలి. మెచ్చుకోవాలి అప్పుడే వారి కళ్ళల్లోని వెలుగును మనం చూడగలుగుతాం. కథలు మేలుకొలుపులు. వినేకొద్దీ ఇంకా వినాలనిపిస్తాయి. చదివేకొద్దీ ఇంకా చదవాలనిపిస్తాయి. చెప్పేకొద్దీ ఇంకా చెప్పాలనిపిస్తాయి. తాతయ్య కథ చెప్తూ ఉంటే చందమామకి కునుకు రావాలి కాని మనవలకి రాదు. జీవితాంతం చెప్పినా తరగని కథలు పిల్లలకి దారిచూపే వెలుగురేఖలు. "జ్ఞానం కంటే ఊహాశక్తి చాలా గొప్పది" అన్నాడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. ఈ మాట అక్షరాల నిజం. పిల్లల్లో ఊహాశక్తిని పెంపొందించడానికి కథ చెప్పడం ఓ చక్కని మార్గం. ఆయన మరొక మాట కూడా చెప్పారు" మీ పిల్లలు తెలివైనవాళ్ళుగా ఎదగాలను కుంటే వాళ్లకు మంచి కాల్పనిక కథలను చదివి వినిపించండి అని. కాల్పనిక కథలకు ఉండే గొప్పతనం అటువంటిది. అనగా అనగా అనగానే పిల్లలు ఊహా ప్రపంచంలోకి వెళ్ళిపోతారు కథలోని పాత్రల్లో తమని తాము ఊహించుకుంటారు. దృశ్యాన్ని చూస్తే అనుభూతి లభిస్తుంది కానీ ఆలోచించే అవసరం ఎక్కువ ఉండదు. అయితే కథ చెప్పడం, చదవడం, వినడం వల్ల పిల్లల్లో కాల్పనిక జగత్తు విస్తృతవౌతుంది. సృజనాత్మక సామర్థ్యం పెరుగుతుంది. కథ వింటూ ఎన్నో ప్రశ్నలు అడుగుతూ ఉంటారు. దానివల్ల ఆలోచనా పరిధి పెరుగుతుంది. ప్రశ్నించే తత్వంతో పాటు సమస్యలను పరిష్కరించే సామర్థ్యం పెరుగుతుంది. అన్నిటికీ మించి వివిధ పదాలను పరిచయంచేస్తూ భాషా సంపత్తిని పెంచడానికి కథలు దోహదపడతాయి. పిల్లల్లో కల్పనాశక్తి అధికంగా ఉంటుంది. వాళ్లు చిత్రవిచిత్రంగా ఊహించగలరు. ఆ ఊహలకు ప్రాణం పోయగలిగితే ఆ కల్పనాశక్తి బయటకు లాగగలిగితే వాళ్ళు కవులుగా, కళాకారులుగా, భావకులుగా తయారుకాగలరు. మానవత కలిగిన మంచి మనుషులుగా రూపు దిద్దుకుంటారు. సరియైన సూచన కాని ఆధారంకాని లేకుండా వారి కల్పనకు ఊపిరిపోయలేము. కొన్ని ఆధారాలు ఇచ్చి కథలు అల్లమనాలి. ఈ కథలు మనం అనుకున్న విధంగా ఉండాలని భావించకూడదువారికి ఇష్టమైన రీతిలో ఊహించనివ్వాలి. వాటిని భాషా నైపుణ్యపు అభ్యసనాలుగా మార్చగూడదు. మాస్టారూ మేం పిల్లలం పువ్వుల్లాంటిపిల్లలం, పిట్టల్లాంటి పిల్లలం, మమ్మల్ని పువ్వులానే చూడండి గుభాళిస్తూ వికసిస్తాం. పిట్టల్లానే ప్రేమించండి రెక్కలువిప్పి దూసుకెళతాం మమ్మల్ని భయపెట్టకండి ఆలోచించనివ్వండి ఆకాశపుటంచులు చూస్తాం. మాకు స్వేచ్ఛనివ్వండి పురివిప్పి రంగులజల్లు కురిపిస్తాం. మమ్మల్ని ఆడుకోనివ్వండి ఆటల్లోనే పాఠాలు నేర్చుకుంటాం. పాడుకోనివ్వండి పాటల్లోనే ప్రపంచాన్ని తెలుసుకుంటాం అంటోంది పిల్లల అంతరంగం. అందుకే



ఉపాధ్యాయులైనా తల్లిదండ్రులైనా వారికి తగిన స్వేచ్ఛనిచ్చి భయంలేకుండా మాట్లాడనివ్వాలి. కథలవల్ల పఠనాసక్తి పెరుగుతుంది. వ్యక్తిత్వ నిర్మాణం జరగాలంటే కాల్పనిక కథలు తప్పనిసరిగా చదివించాలి. అందుకే బాలసాహిత్యంలో కాల్పనిక కథలకే పట్టం కట్టడం జరిగింది. అందులోనూ పేదరాసిపెద్దమ్మ కథలన్నా, పంచతంత్ర కథలన్నా, భేతాళ కథలన్నా పిల్లలు చెవికోసుకుంటారు. రాకుమారులు మాంత్రికుల కథల్లో చాలాసార్లు పేదరాసి పెద్దమ్మ కనిపిస్తుంది. మంచి వాళ్లందరికీ తలలో నాలుకలా ఉండే ఆమెకి తెలియని విషయమే ఉండదు. తన దగ్గరికి వచ్చేవారికి తగిన సలహాలనిస్తూ సమస్యలనుంచి గట్టెక్కిస్తుంది. ఇలాంటి కథలు చదవడం, వినడం వల్ల పరోపకారబుద్ధి సమస్యా పరిష్కారం పిల్లల్లో అలవడతాయి. పిల్లల్ని ఊహాలోకాల్లో విహరింపచేసే కథల్లో ముఖ్యమైనవి జానపద కథలు. ఇవి చదవడం వల్ల రాజుల సాహసాలు, విశాల హృదయం, ముందుచూపు, మంత్రుల బుద్ధికుశలత, విదూషకుల హాస్యచతురత వంటివి జానపద కథల్లో చదివి పిల్లలు ఉత్తేజితులౌతారు. రోజువారీ దినచర్యలో విసుగెత్తిపోయినపుడు ఊహాశక్తి మందగిస్తుంది సరిగ్గా అలాంటప్పుడే రెక్కలు కట్టుకుని ఎక్కడికైనా ఎగిరిపోవాలనిపిస్తుంది. ఆ సమయంలో కాల్పనిక కథ చదివినట్లయితే అకస్మాత్తుగా ఏ పిల్ల పిశాచమో ప్రత్యక్షమై అడవిలోకి తీసుకెళ్లి మర్రిచెట్టు తొర్రలోని రత్న రాశులని చూపించవచ్చు. కోరిన చోటికి చిటికెలో చేర్చే పావుకోళ్లు సొంతం కావచ్చు. రెక్కల గుర్రాలు, పుష్పకవిమానాలు, పరకాయప్రవేశాలు ఇంకా అనేకానేక అలౌకిక అనుభూతుల్ని కలుగజేసే సమ్మోహనాశక్తి కాల్పనిక కథలకుంది. "చీమలచేత, పక్షులచేత మాట్లాడించడంలోనే గొప్పతనముంది" అంటారు గోల్డ్‌స్మిత్ అనే రచయిత. పిల్లలు సాధారణంగా జానపద కథలు ఇష్టపడతారు. జానపదకథలన్నీ అద్భుతరసాన్ని కలిగి ఉంటాయి. ఈ కథలు పిల్లల్ని కొత్త ప్రపంచంలోకి తీసుకుని పోతాయి. వాళ్ళల్లో ఊహాశక్తిని పెంపొందింపచేస్తాయి అందువల్ల పిల్లలు ఎక్కువగా ఇష్టపడతారు. మామూలుగా కనిపించనటువంటి ఆకాశంలో ఎగిరే చాప, మంత్రదండం, నీళ్లను మంత్రించి జల్లితే మనిషి జంతువుగా మారడం లాంటివి పిల్లలకి ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. భేతాళ కథలని కూడా పిల్లలు ఎంతగానో ఇష్టపడతారు. ఈ కథల్లోని భేతాళుని ప్రశ్నలకు రకరకాల సమాధానాలు ఊహిస్తారు పిల్లలు. పిల్లల ఊహలకందని విధంగా జవాబు చెప్తాడు విక్రమార్కుడు. అదే పిల్లలకి ఆసక్తిని కలిగిస్తుంది. ఈ కథల్లో తార్కికభావన ధర్మసందేశం మొదలగునవి ఉంటాయి. ఈ రకమైన కాల్పనిక కథలు పిల్లల మనసులమీద చెరగని ముద్రవేస్తాయి. అదే విధంగా వారి వ్యక్తిత్వ వికాసానికి కూడా ఎంతగానో దోహదపడతాయి. చదువులో రాణించినా రాణించకపోయినా ఈ బాలసాహిత్యం చదివినవారు మాత్రం గొప్ప వ్యక్తులుగా తయారు అవుతారు. పిల్లల మనోవికాసానికి, ఆనందానుభూతికి, కలలను సాకారం చేసుకోవడానికి కాల్పనిక కథలు ఎంతగానో దోహదపడ తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే కాల్పనిక కథలకు బాలసాహిత్యంలో ప్రత్యేకమైన స్థానముంది.

సత్యమేవ జయతే



# ఈ ఫుడ్స్ మీ శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ మంచులా కరిగిస్తాయి..

నేటి జీవనశైలి, తప్పుడు ఆహారం మన ఆరోగ్యంపై చాలా ప్రభావం చూపుతున్నాయి. అధిక కొలెస్ట్రాల్ అనేది చాలా మందిని వేధిస్తున్న సమస్య. జంక్ ఫుడ్ తినడం వల్ల అధిక కొలెస్ట్రాల్ తోపాటు పలు ఆనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ముఖ్యంగా అనారోగ్యకరమైన ఆహారం గుండె ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తుంది. ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారాన్ని అలవాటు చేసుకోవడం తప్పనిసరని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. కన్సల్టెంట్ పోషకాహార నిపుణుడు రూపాలి దత్తా, “అధిక కొలెస్ట్రాల్‌ను నివారించడానికి మంచి ఆహారం, క్రమమైన వ్యాయామం, శరీర బరువు, ఆరోగ్యకరమైన జీవనశైలి కీలకమని తెలిపారు. , కొలెస్ట్రాల్ స్థాయిలను సమర్థవంతంగా తగ్గించగల ఐదు ఆకర్షణీయమైన ఆహారాల కలయిక గురించి పేర్కొన్నారు.అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు, ముఖ్యంగా పెరిగిన %ాణూ% లేదా “చెడు” కొలెస్ట్రాల్, గుండె ఆరోగ్యానికి ముప్పును కలిగిస్తాయి. హృదయ సంబంధ వ్యాధులను అభివృద్ధి చేసే అవకాశాలను గణనీయంగా పెంచుతాయి. %ాణూ% కొలెస్ట్రాల్ ధమనులలో పేరుకుపోతుంది, రక్త నాళాలను ఇరుకైన, గట్టిపడే ఫలకాలను ఏర్పరుస్తుంది. కాలక్రమేణా, ఇది గుండెపోటులు, స్ట్రోకులు మరియు కొరోనరీ ఆర్టరీ వ్యాధి వంటి వివిధ హృదయనాళ పరిస్థితులకు దారితీస్తుందని తెలిపారు. శరీరంలో నుంచి చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించుకునేందు ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

ఇవి కూడా చదవండి

కొలెస్ట్రాల్‌ను “మంచి” కొలెస్ట్రాల్‌గా పరిగణిస్తారు, ఎందుకంటే ఇది రక్తప్రవాహం నుండి అదనపు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడుతుంది. మరోవైపు, ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను “చెడు” కొలెస్ట్రాల్ అని పిలుస్తారు, ఎందుకంటే అధిక స్థాయిలు ధమనులలో ఫలకం ఏర్పడటానికి దోహదం చేస్తాయి.

ఆరోగ్యకరమైన ఆహారం కొలెస్ట్రాల్ స్థాయిలను ఎలా తగ్గించడంలో సహాయపడుతుంది?

తక్కువ సంతృప్త, ట్రాన్స్ ఫ్యాట్స్, ఫైబర్ అధికంగా ఉండే, గుండె-ఆరోగ్యకరమైన పోషకాలను కలిగి ఉన్న ఆహారాలను చేర్చడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇటువంటి ఆహారాలు %ాణూ% కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. అంతేకాదు మొత్తం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి ఉత్తమ ఆహారాలు ఇవే:



1. బ్రౌన్ రైస్‌తో పప్పు తినండి:

అన్నం, పప్పు ఈ కాంబినేషన్ ను భారతీయులు చాలా ఇష్టపడుతారు. చాలా మంది ఈ కలయికలో వైట్ రైస్‌ను ఎంచుకున్నప్పటికీ, అధిక కొలెస్ట్రాల్ స్థాయిలతో బాధపడుతున్న వ్యక్తులు వైట్ రైస్ కు బదులు బ్రౌన్ రైస్ ఎంచుకోవాలి. బ్రౌన్ రైస్‌లో ఉండే నూనె చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

2. పెరుగు, బాదం:

పెరుగు, బాదం రెండూ కూడా పోషక శక్తి కేంద్రాలు. సాధారణంగా వీటిని విడిగా తింటుంటాం. అయినప్పటికీ ఈ రెండు కలిపి తింటే అవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి గొప్ప ప్రయోజనాలను అందిస్తాయి. బాదంపప్పులో సంతృప్త కొవ్వు ఆమ్లాలు తక్కువగా ఉంటాయి, అయితే పెరుగులో ప్రోబయోటిక్‌లు ఉన్నాయి, ఈ కలయిక కొలెస్ట్రాల్ నిర్వహణలో అద్భుతంగా పనిచేస్తాయి. సంతృప్తికరమైన, పోషకమైన ఆహారం కోసం ప్రతిరోజూ పెరుగుతోపాటు బాదం తినండి.

3. వెల్లుల్లి, ఉల్లిపాయ:

వెల్లుల్లి, ఉల్లిపాయిలు భారతీయ వంటకాలకు మరింత రుచిని జోడించడమే కాకుండా అధిక కొలెస్ట్రాల్‌ను నివారించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. వెల్లుల్లిలో అల్లిసిన్ ఉంటుంది, ఇది కొలెస్ట్రాల్-తగ్గించే లక్షణాలకు ప్రసిద్ధి. ఈ రెండూ కూడా చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో కీలకం పనిచేస్తాయి.

4. గ్రీన్ టీ, నిమ్మరసం

గ్రీన్ టీ, బరువు తగ్గించే ప్రయోజనాలకు ప్రసిద్ధి చెందింది. యాంటీఆక్సిడెంట్లతో నిండిన గ్రీన్ టీ కొలెస్ట్రాల్-తగ్గించే గుణాలను కలిగి ఉంది. గ్రీన్ టీలో నిమ్మరసం కొన్ని చుక్కలను కలపండి. నిమ్మరసంలో ఉండే ఫ్లేవనాయిడ్లు దాని కొలెస్ట్రాల్-నియంత్రణ సామర్థ్యాన్ని మరింతగా పెంచుతాయి. ఈ రిఫ్రెష్ టీని వేడిగా లేదా చల్లగా తాగండి.

5. పసుపు, నల్ల మిరియాలు:

పురాతన భారతీయ వంటగది ప్రధానమైన పసుపు , కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడే శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంది. కొలెస్ట్రాల్-చికిత్స సామర్థ్యాలకు ప్రసిద్ధి చెందిన పైపెరిన్ అనే సమ్మేళనాన్ని కలిగి ఉన్న నల్ల మిరియాలు, కొలెస్ట్రాల్-తగ్గించే ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. వీటిని రెగ్యులర్ గా సూప్ లలో చేర్చుకున్నట్లయితే చెడు కొలెస్ట్రాల్ కరిగిపోతుంది.ఈ ఫుడ్ కాంబినేషన్‌లను మీ డైట్‌లో చేర్చుకోవడం ద్వారా, కొలెస్ట్రాల్ స్థాయిలను సమర్థవంతంగా తగ్గించుకోవచ్చు

## మహిళలకు జింక్ ఎందుకు ముఖ్యం అది లేకపోవడం వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయి?




స్త్రీ శరీరం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. ఇది యుక్తవయస్సు నుండి గర్భం, తల్లిపాలు, రుతువిరతి వరకు అనేక మార్పులకు లోనవుతుంది. శరీరానికి ఐరన్, కాల్షియం ఎంత అవసరమో, జింక్ ఉనికి కూడా అంతే ముఖ్యం. మన శరీరంలో పోషకాలు ఉండటం మంచి ఆరోగ్యానికి చాలా ముఖ్యం. జింక్ మన ఆరోగ్యానికి అవసరమైన ఖనిజాలలో ఒకటి. దాని లోపం అనేక సమస్యలను కలిగిస్తుంది.

జింక్ చర్మ ఆరోగ్యానికి మంచిది:

జింక్ యాంటీ బాక్టీరియల్ సామర్థ్యాల వల్ల మొటిమలు, తామర, ఇతర చర్మ సమస్యలను నివారించవచ్చు. ఇది ఆరోగ్యకరమైన చర్మాన్ని కలిగి ఉండటానికి, వృద్ధాప్య సంకేతాలను తగ్గించడానికి, కొల్లాజెన్ ఏర్పడటానికి ప్రేరేపిస్తుంది.

స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థ అభివృద్ధి, పనితీరు జింక్‌పై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఇది ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్, టెస్టోస్టెరాన్ శరీరం సంశ్లేషణకు కూడా బాధ్యత వహిస్తుంది. లైంగిక అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన హార్మోన్లు, సంతానోత్పత్తికి జింక్ చాలా అవసరం.

జింక్ మెదడు ఆరోగ్యానికి సహాయపడుతుంది:

మెదడు అభివృద్ధికి, పనితీరుకు జింక్ చాలా అవసరం. ఇది న్యూరోట్రాన్స్మిటర్ల ఉత్పత్తిలో పాల్గొంటుంది, ఇవి మానసిక స్థితిని నియంత్రించడానికి, నరాల ప్రేరణల ప్రసారానికి చాలా ముఖ్య పాత్ర పోషిస్తుంది.

గుండె ,ఎముకల ఆరోగ్యాని మంచిది:

జింక్ వల్ల గుండె ఆరోగ్యం ప్రభావితమవుతుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. బలమైన రక్త నాళాలను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఆరోగ్యకరమైన ఎముకలను రూపొందించడానికి జింక్ కీలకమైన ఖనిజం. ఇది ఎముక పగుళ్లు,బోలు ఎముకల వ్యాధి వంటి వ్యాధులను నివారిస్తుంది.

గాయం నయం చేయడానికి:

శరీరంలో జింక్ లోపిస్తే గాయాలు త్వరగా మానవు. జింక్ కొల్లాజెన్ సంశ్లేషణలో సహాయపడుతుంది, ఇది గాయం నయం చేయడానికి అవసరమైన ప్రోటీన్‌గా పరిగణించబడుతుంది. జింక్ దెబ్బతిన్న చర్మాన్ని రిపేర్ చేస్తుంది. ఇది రుచి, వాసన సామర్థ్యాన్ని పదునుపెడుతుంది.

థైరాయిడ్ పనితీరును మెరుగుపరుస్తుంది:

జింక్ థైరాయిడ్ హార్మోన్లు శరీరం జీవక్రియ, మానసిక స్థితి, శక్తి స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.

## హార్ట్ అటాక్‌కి ప్రధాన కారణాలివే.. వీటికి దూరంగా ఉన్నారంటే మీ చిట్టి గుండె సురక్షితం..



ప్రస్తుత కాలంలో మానవాళిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యలలో గుండెపోటు ప్రథమ స్థానంలో ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఈ రోజుల్లో మనం పాటిస్తున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి నేపథ్యంలో గుండె సంబంధిత సమస్యలు అనేవి సర్వసాధారణమని నిపుణులు..

ప్రస్తుత కాలంలో మానవాళిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యలలో గుండెపోటు ప్రథమ స్థానంలో ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఈ రోజుల్లో మనం పాటిస్తున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి నేపథ్యంలో గుండె సంబంధిత సమస్యలు అనేవి సర్వసాధారణమని నిపుణులు పేర్కొంటున్నారు. ఇంకా గుండెపోటు ప్రాణాంతకమని అయితే దాని నుంచి తప్పించుకోవడం చాలా తేలిక అని వారు సూచిస్తున్నారు. అయితే అంతకంటే ముందు గుండెపోటుకు కారణాలేమిటోతెలుసుకుని, దానికి మూలమైన కారకాలకు దూరంగా ఉంటే చాలని చెబుతున్నారు. ఈ క్రమంలో గుండెపోటుకు కారణాలేమిటో ఇప్పుడు తెలుసుకుందా..

### గుండెపోటుకు కారణాలు

హైబీపీ: గుండెపోటు వంటి హృదయ సంబంధిత సమస్యలకు అధిక రక్తపోటు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. రక్త నాళాల్లో ప్రవహించే రక్తం ఒత్తిడి చాలా ఎక్కువగా ఉన్నప్పుడు గుండె పోటు వస్తుంది. అలాగే ఈ విధమైన రక్తపోటు గుండె ఆరోగ్యంతో పాటు కిడ్నీలు, బ్రెయిన్, కాలేయం వంటి ఇతర అవయవాల పనితీరు, ఆరోగ్యాన్నికూడా ప్రభావితం చేస్తుంది. ఈ నేపథ్యంలో రక్తపోటుకు కారణమయ్యే ఆహారాలకు దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

జీవనశైలి: శారీరక శ్రమ లేకపోవడం, ఎక్కువ సమయం కూర్చొని పనిచేయడం వంటి జీవనశైలి అలవాట్ల కారణంగా కూడా గుండెపోటు సంభవించే ప్రమాదం ఉందని కార్డియాలజిస్ట్‌లు పేర్కొంటున్నారు. ఈ మేరకు ప్రతిరోజు భోజనం తర్వాత కనీసం 10 నిముషాలు లేదా 400 మీటర్లు అయినా నడవడం మంచిదని వారు సూచిస్తున్నారు.

ప్రకృతి సంరక్షణ కోసం ప్రధాని మోదీ పిలుపు..

ఆహారపు అలవాట్లు: తినే ఆహారమే ప్రధానంగా మన ఆరోగ్యంపై ప్రధానంగా ప్రభావం చూపుతుంది. ఎలా అంటే ఉప్పు, కొవ్వు, చక్కెర ఎక్కువగా ఉన్న ఆహారాలను తినడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది. ఫలితంగా అది గుండె పోటుకు దారితీస్తుంది. కాబట్టి ఆహారం విషయంలో కూడా జాగ్రత్త వహించాలని నిపుణులు చెబుతున్నారు.

మద్యపానం: పరిమితమైన మోతాదులో మద్యం తాగితే ఆరోగ్యానికే ప్రయోజనం, కానీ మితిమీరితే ప్రాణాలకే ప్రమాదమని వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండెపోటుకు కూడా అధిక మోతాదులో మద్యం తాగడమే కారణమని వారు అంటున్నారు.

ధూమపానం: పొగ తాగడం ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిది కాదు. ఎందుకంటే సిగరెట్లు, పొగాకు నుంచి వచ్చే పొగ రక్తనాళాల్లో ఫలకం ఏర్పడేలా చేసి గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి. కాబట్టి పొగ తాగకపోవడమే మీ గుండెకు, ఆరోగ్యానికి శ్రేయస్కరం.

## కష్టమైన సరే కాస్త అలవాటు చేసుకోండి.. ‘మొక్కజొన్న రొట్టె’ ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?



మొక్కజొన్న ఉత్తరభారతంలో చాలా ఎక్కువగా వినియోగిస్తారు. ఇది సాధారణంగా శీతాకాలంలో వినియోగిస్తారు. దీనిని గోధుమ పిండికి ప్రత్యామ్నాయంగా వినియోగిస్తారు. ఈ మొక్క జొన్న రొట్టెలో మెగ్నీషియం, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. కాబట్టి దీని వినియోగం ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కార్న్ బ్రెడ్ తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కాలక్రమేణా బరువు తగ్గుతారు. ఈ రోటీలో టానిన్ కంటెంట్ చాలా ఎక్కువ. కాబట్టి మధుమేహాన్ని నివారిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎటువంటి భయం లేకుండా మొక్కజొన్న రొట్టె తీసుకోవచ్చు. దీనితో పాటు, ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె ఆరోగ్యానికి కూడా సహాయపడుతుంది. మొక్కజొన్నలో ఐరన్, ఫాస్ఫరస్, జింక్ , వివిధ విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. అనామ్లజనకాలు సమృద్ధిగా ఉంటాయి. మొక్కజొన్న పిండి కంటి చూపుకు కూడా చాలా మంచిది. మొక్కజొన్న పిండితో చేసిన రొట్టెలో కెరోటినాయిడ్లు, విటిమిన్-ఏ ఎక్కువగా ఉంటాయి. అందుకే ఇది మన ఆరోగ్యానికి ఎంతో మంచిది. ముఖ్యంగా కళ్లకు ఎంతో మేలు చేస్తాయి. క్యాన్సర్, రక్తహీనత నివారణలో కూడా మొక్కజొన్న సహాయపడుతుంది. ఇది గ్లూటెన్ ఫ్రీ , బరువు తగ్గడానికి చాలా ప్రభావవంతంగా ఉంటుంది, ఎందుకంటే ఇందులో కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్‌లు ఉంటాయి. ఇవి విచ్ఛిన్నం కావడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి. ఇది బరువును సరిగ్గా నిర్వహించడంలో సహాయపడుతుంది. కొన్నిసార్లు, జ్వరం పెరిగినప్పుడు, అన్నం తినడం ఇష్టం లేక కష్టంగా ఉంటుంది. అప్పుడు మొక్కజొన్న రొట్టె ఉపయోగకరమైన ఆహారం. అలాగే, ఈ రోటీని తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది.